
# బాల

.పిల్లల బొమ్మల పత్రిక.





నా చేతిలో ఏముందో చెప్పకోండిచూద్దాం! అంటోంది చి॥ ఎస్. గీత.


జెమినీ వారి
అపూర్వ
సహోదరులు
( తెలుగు )
భావోద్రేకముతో కూడిన
మహోత్తర చిత్రము......
జనవరి 14 తేదీ నుంచి
ఆంధ్రదేశములో, హైదరాబాదు సంస్థానములో
అన్ని ముఖ్య కేంద్రములలో విడుదల....

# చందూ యొక్క సాహసము.




ది టాటా ఆయిల్ మిల్స్ కంపెనీ, లిమిటెడ్.




: డిస్ట్రిబ్యూటర్లు :

ఆంధ్రా : సీడెడ్ : నైజాం : రాజశ్రీ పిక్చర్సు, **విజయవాడ.**

మైసూరు : కూర్గు : సౌత్ కెనరా : **యశోధరాఫిలిమ్స్, బెంగుళూ**

ఇతర వివరములకు :

యం. ఆర్. ఎ. ప్రొడక్షన్స్. మద్రాసు 18. లేక

ప్రమియా టాకీ డిస్ట్రిబ్యూటర్లు, జనరల్ పాటర్స్ రోడ్, మద్రాస్

# అమృతాంజనము

తామర తంపరగా పడుబాధల - తరుమజాలనని భయపడకు
అమృతాంజనము పేరువినినచో - అవియెల్లయు గడగడ వడకు ॥తా॥

తలనొప్పికి తలనొప్పి పుట్టును - కంటినొప్పి కనుకనబడదు
పంటినొప్పియు పలాయనంబగు - తుంటినొప్పియు తుడుచుకపోవును॥

ఏదో ఒకరూపముతోవచ్చి - యెల్లరినివియే పీకితినున్
బాధల నణచి సేదదీర్చుకొన - స్వీకరింపు మమృతాంజనమున్ ॥తా॥

రొంపదగ్గు ఎగశోషలకు - చెంపపెట్టు అమృతాంజనము
వాతము పట్లను నరముల పోట్లను - వారించెడి దమృతాంజనము ॥తా॥

తామర గజ్జి సెగ కురుపులను - తరుమ గలది అమృతాంజనము
అలసిన మేనుకు బలము గూర్చును - అమృతాంజనపు మర్దనము ॥తా॥

బుద్ధి బలంబు ప్రయోగ మధికమై - శ్రద్ధకూడిన వారలకు
శుద్ధంబైన చురుకు తనము చవి - చూపించెడి దమృతాంజనము ॥తా॥

పని పాటులు చల్లగ చేసుకొని - మనుగడ శ్రీమంతముగ గడుపుకొన
మదిలోపలను ఉవ్విళ్లూరే - మనుజకోటికిని కైదండ యిది ॥తా॥

పట్టములందును పల్లెలయందును - పీఠంబులు నెలకొల్పుకొని
బాధా పీడిత జనులందరికిని - పరమాద్భుతసాయము చేయున్ ॥తా॥

"ఎప్పుడెప్పుడే బాధకలిగినా - తప్పించెడి దమృతాంజనమే"యని
పిన్నపెద్దలు పాడుచుండెడి - ప్రేమ గీత మమృతాంజనము ॥తా॥

గరిమెళ్ళ సత్యనారాయణ బి. ఎ.




**'BALA'—CHILDREN'S ILLUSTRATED MONTHLY**

సంపాదకుడు : న్యాయపతి రాఘవరావు, బి. ఎ.

సహాయ సంపాదకురాలు : న్యాయపతి కామేశ్వరి, బి.ఎ., ఎల్.టి.

**సంపుటి 5**] జనవరి, 1950 [**సంచిక 6**

# ఈ "బాల"—ఒచ్చే "బాల"

బాలలూ !

ఈ యేడు "బాల" సంక్రాంతి సంచిక వేయలేదు. ఎందుచేతనో తెలుసా? మనదేశంలో తుపానుల వలన చాలా నష్టం కలిగింది. అటువంటి సమయంలో 1 రూపాయి ఇచ్చి పిల్లలు సంక్రాంతి సంచికను కొనగలరా?

ఈ జనవరి 26 తేదీ మనకి ఒక పండుగదినము. ఆరోజున మన "ఇండియన్ రిపబ్లిక్" స్థాపన జరుగుతోంది. ఆ రోజు సరికే బహుశః మన ఆంధ్రరాష్ట్రం స్థాపనకూడా జరుగుతుంది.

ఈ విషయాలన్నీ మీకు బాగా తెలియడానికి ప్రత్యేకంగా జనవరి 26 తేదీ సరికే ఒచ్చేనెల "బాల" బాగా తయారయి వస్తుంది. అందరూ తప్పక ఆ "బాల" చదవండేం!




పోవే పోవే నలభై తొమ్మిది
పోవే త్వరగా పోవే

దురదృష్టాన్ని నీతోపాటు
తీసుకుపోవే త్వరగా

తుపానుతోటి ఎంతోనష్టం
తెచ్చిచ్చావా మాకు

పశువుల జనుల ధనధాన్యాదుల
బలినే కోరేవా

చాలు చాలు నీమేలు మరువమీ
జన్మలో ఎప్పటికి

దురదృష్టాన్ని నీతోపాటు
తీసుకుపోవే త్వరగా.




రావే రావే యాభై రావే
రావే త్వరగా రావే

అదృష్టాన్ని నీతోకూడా
అందరికియ్యగ తేవే

జనవరి ఇరవై ఆరోతేది
జనుల కందరికి మోదం

అన్నిటికంటె మనకందరికి
ఆంధ్రరాష్ట్రం అవసరం

ప్రపంచకానికి భారతదేశపు
ప్రతిభను చూపాలి

అదృష్టాన్ని నీతోకూడా
అందరికియ్యగ తేవే.

రచన: బులుసు వారబ్బాయ్

# మరదలు హాస్యం


బలే బలే బావగారు
బయలు దేరేరా ?
హేటుబూటు సూటంతా
బనాయించేరా !
ఓడిపోయిన కోడిపుంజు
ఒకటి కావాలా, 1
ఎండిపోయిన బెండకాయలు
రెండు కావాలా ? 2
మాడిపోయిన బటానీలు,
మూడు కావాలా ? 3
నలిగిపోయిన మల్లెపూలు
నాల్గు కావాలా ? 4
అతుకు తెగిన గాజులు మీ
కైదు కావాలా ? 5
చారులోని గారెలు మీ
కారు కావాలా ? 6
వేడి వేడి పకోడీలు
ఏడు కావాలా ? 7
ఘనమైన టపాకాయ
లెనిమి దివ్వాలా ? 8
కమ్మనైన మొట్టికాయలు
తొమ్మి దివ్వాలా ? 9
పదిలమైన టెంకి జెల్లలు
పదియు కావాలా ? బలే ! 10




## పొట్టిబావ

మంచివాడు మంచివాడు
మామంచి వాడు
మంచివారిలోకెల్ల
మామంచి వాడు.
వెన్న బెడితే మ్రింగలేదు
వేలుబెడితే కరవలేదు
కలియబడితే నిలవలేదు
కాకివంటిపక్షి !
కడుపు నిండితే
మారడగడు
కదురువంటి మాబావ.
కూనిరాగాల్
కుయ్యగలడు
కుడుమువంటి మాబావ
తోక లేదు మాబావకు
లేకుంటే హనుమంతుడె,
పాపం మాబావగారిది
బేపి మూంతి !

రచన: నాగవోలు వెంకట అప్పారావు
(ఫ్రిల్లి)



రత్నం
అతిమృదువైనది!
లావణ్యమైన మెరుగు చర్మమునకు చాలా
యిస్తుంది. పరిశుభ్రంగా చేసి.
చర్మాన్ని తయారుచేస్తుంది-చర్మం
పాలిపోయివట్టు చెయ్యదు.
మైసూరు
శాండల్ సోప్




అనువాదం: నూరిశెట్టి సాంబశివరావ్ బాజ్జీ

## జవహర్ పుట్టినరోజు పండగ

ఇంకొక సంగతి-అతని బాల్య జీవితంలో చాలా ఉత్సాహం కలిగించినవి మన పండుగలు! వాటికోసం అతను యెంతో ఆదుర్దాగా యెదురు చూస్తుండేవాడు. 'హోలీ' అనే పండుగ చాలా పెద్దపండుగ. ఆవేళ అతను తన పిచికారీ గొట్టం మంచి మంచి రంగునీళ్లతో నింపి పెద్ద పెద్ద అమ్మాయిలమీదకి వొదిలి జల్లుతూండేవాడు. వాళ్లందర్నీ తోటచుట్టూ తిప్పించి తిప్పించి బట్టలనిండా జల్లి పిచికారీ గొట్టాల్ని కాళీచెయ్యటం అతనికి సరదా.


దీపావళి పండుగొచ్చిందంటే యింతకన్నా సరదా. ఆవేళ ఆనందం యింక చెప్పనే అక్కర్లేదు. ఎందుకంటే లెక్కపెట్టలేనన్ని చిన్నదీపాలంటే అతనికి నిజంగా ప్రాణాల్తో సమానం.

ఇంట్లో యేదేనా పెళ్లి జరిగితే చాలు, జవహార్ ఉబలాటం అంతా యింతా కాదు. ఎందుకో తెలుసా? మంచి మంచి పిండివంటలు తినొచ్చు. బాణా సంచా టపాకీలు కాల్చొచ్చు. భలే భలే పాటలు పాడుకోవొచ్చు. తనయీడు పిల్లలందరూ అక్కడికొస్తారు గాబట్టి వాళ్లతో

కలిసి ఆడుకోవొచ్చు. అప్పుడప్పుడు యేదేనా వూరికి ప్రయాణమన్నా ఒకటే పరుగు! ఇవన్నీ యెందుకుగాని అన్నిటికన్నా ముఖ్యమైందీ, తన జీవితంలో మరిచిపోలేందీ, అతని పుట్టిన రోజే! మిగతా రోజులన్నీ ఒకొంతూ ఆ వేళ మాత్రం ఒకొంతూ అనుకోవాలి. అతను పలుకుబడి సంపాయించుకున్న తర్వాత అదొక ప్రాముఖ్యమైన దినమైపోయింది.

మోతీలాల్‌కి జవహర్ మొదటికొడుకూ, ఒకడే కొడుకూ కావటంవల్ల నెహ్రూ కుటుంబానికది ఒక పవిత్రమైన దినం!

పుట్టినరోజు పండుగనాడు తెల్లవారుజామునే జవహర్‌ని లేపి ఆరోజుల్లో బీదవాళ్లకి సాధారణంగా ధర్మంచేసే తినుబడి వస్తువులతోనూ, గోధుమలతోనూ అతణ్ని తూచేవాళ్లు. ఆకాటాలో ఓ వేపు కూచుని గోధుమల మూటలు మరో వేపు పడేయ



శకుంతలా మసానీ కుంకుంకి చెప్పిన కథకి అనుసరణ—

గానే నింపాదిగా మీదికి తేలి పోవటం అతనికి చాలా మజాగా వుండేది.


ఇదయ్యేక వాళ్లమ్మ అతనికి శుభ్రంగా స్నానం చేయించి తుడిచి జల్తారుతో జిగ జిగా మెరిసే బట్టలన్నీ తొడిగేది. అప్పుడతను కుప్పలు కుప్పలుగా కురిసే బహుమానాల కోసం తయారయ్యేవాడు. ఆరోజంతటికీ యిదొక సరదా. తనకిచ్చే ప్రతీ బహుమతీ యేదో కాయితం తోనో గుడ్డతోనో కట్టివుండటం వల్ల అందులో యేమిటి వుందా అని తనలో తనే ఆలోచించుకునే వాడు. కాని అతననుకునేది యెప్పుడూ తప్పే అయ్యేది తను ఒకటనుకుంటే దాంట్లో అంత కన్నా విచిత్రమైన వస్తువో, తనెప్పుడూ ఊహించుకోలేని కానుకో వుండేది. ఇంక ఆ కానుకలు యిన్ని అన్ని అని లెక్క పెట్టలేం. అతని పుట్టినరోజు పండుగన మాత్రం యెవ్వరూ మరిచిపోలేనన్ని బహుమానాలొచ్చేవి.

ఆ వేళ సాయంకాలం పెద్ద విందు జరిగేది. దానికి యెందరెందరో వొచ్చి యిష్టమొచ్చినంత తిని, కావలసినంత తాగి కులాసాగా గడిపేవాళ్లు. అందరి కన్నా యెక్కువ మన జవహర్! అతనికి రోజంతా గడియలాగా గబగబా గడిచి పోయేది. రాత్రి పరుపు మీద పడుకువాల్చేటప్పుడు యీ పుట్టినరోజు పండగలు యేడాదికొకసారేగదా వొస్తాయని విచారిస్తుండేవాడు.

జవహర్ పదేళ్ల అబ్బాయిగా వున్నప్పుడు నెహ్రూ కుటుంబం యింకోమంచి అంగాల లోగిలి 'ఆనంద భవనం' లోకి మారిపోయారు. ఆనంద భవనం అంటే తెలుసుగదూ, కుంకుం?- సరదాల యిల్లు-చాలా పెద్ద మహలు-చుట్టూ అందమైన తోట. చక్కగా ఈతాడుకునే చిన్న కోనేరూ. ఎంచక్కా వుంటుందనుకున్నావు! ఈకొత్త యింట్లోకి వొచ్చేక జవహర్‌కి మరి సంతోషంగా ఉంది. ఇరవై నాలుగ్గంటలూ ఆకోనేట్లోనే ఆడుకుని యీత బాగా నేర్చుకున్నాడు. సాయంకాలం వేళ అతని నాన్నగారి నేస్తాలంతా ఆకోనేట్లో యీదటానికొచ్చే

వాళ్లు. ఎందుకంటే అలహాబాదు మొత్తం అంతటికీ యిదొక్కటే మొట్ట మొదటి యీత కోనేరు. అదీ గాకుండా చాలా కొత్తది. ఊళ్లో ఉండేవారందరికీ చాలా సరదాగా వుంది.

సాయంకాలం యీతకొచ్చే వాళ్లందరి దగ్గిరా తనకి యీదటంలో యెంత నేర్పుందో చూపించి, ఆనీట్లోనే పెద్దవాళ్లతో సైతం దాగుడు మూతలాడి డంగ్తించేవాడు. ఎలా తెలుసా? నింపాదిగా కిక్కురుమన కుండా వెనకనించే వొచ్చి వాళ్ల బుర్రలుపట్టి నీట్లో ముంచేస్తుండేవాడు. లేకుంటే ఎవరేనా వొడ్డుకొచ్చి దమ్ము తీసుకుంటూంటే మెల్లిగా పైకెక్కి టపీమని వాళ్లని నీట్లోకి తోసేవాడు. అతను ఆకోనేరు నీట్లో ఉన్నంతసేపూ పెద్దవాళ్లకసలు వూపిరి సలిపేది కాదు.



ఆనందభవనంలో కనిపించే యింకో విడ్డూరం అక్కడి యెలక్ట్రిక్ దీపాలు! అప్పటికి అలహాబాదులో మరే యింటికీ ఎలక్ట్రిక్ దీపాలు లేవు. జవహర్ ఈ యెలక్ట్రిక్ దీపాల్లో వున్న విచిత్రం కనిపెట్టాలని చాలావరకు ప్రయత్నించాడు.

మోతీలాల్‌కి నేస్తాలంటే చాలా యిష్టం. అంచేత ఆనందభవనం ప్రతినిమిషం స్నేహితుల్తో కళకళ లాడ్తుండేది. అలాంటప్పుడు జవహర్ డ్రాయింగు రూం పరదా వెనక దాక్కొని వాళ్లనాన్నగారు తన నేస్తాల్తో యెలా తాగుతున్నారో చూసేవాడు. వాళ్లనవ్వుల్తోనూ-వేళాకోళాల్తోనూ యిల్లంతా మారుమ్రోగుతుండేది. ఓమాటు

మోతీలాల్ పరదా వెనకనించి చూస్తున్న కొడుకుని పట్టుకుని బయటికి పంపించేశాడు. అనవసరంగా పట్టుబడిపోయిన జవహార్ పాపం సిగ్గుపడిపోయాడు. దానికి తోడు వాళ్లనాన్నగారతన్ని కాస్సేపు గోడకుర్చీ గూడా కూచోబెట్టారు. అప్పుడు జవహార్‌కి బ్రాందీ యెలా వుంటుందో తెలీదు. వాళ్ల నాన్నగారు దాన్ని తాగుతుంటే గబగబా-గబగబా పరుగెత్తుకెళ్లి వాళ్లమ్మతో, అమ్మా, అమ్మా, చూడవే, నాన్నగారు రక్తం తాగేస్తున్నారు. అన్నాడరుస్తూ.

కొన్నాళ్లుపోయేక జవహార్‌కి యింకో సరదా వొచ్చిపడింది. ఓ బుచ్చి చెల్లాయి పుట్టింది. ఆవేళ జవహార్ వాళ్ల గది బయట నుంచున్నాడు. అంతట్లోకి డాక్టరు బయటికొచ్చి బుచ్చిచెల్లి పుట్టిందన్నాడు. జవహార్ కది గొప్పసంగతేకాని డాక్టరు దాన్ని అటుంచి యిటు మార్చేసి, "ఓష్, నువ్వింకా సంతోషించాలి. ఎందుకంటే యిదే తమ్ముడయితే మీనాన్నగారి ఆస్తి నీతోబాటు పంచుకో



[illegible]లీసు :- ఏమోయ్ ! అబ్బాయీ ! [illegible]కిల్‌కి [illegible] లైటు లేదు [illegible]పు! ఆపు!

అబ్బాయి :- క్షమించండి. ఈ సైకిలికి బ్రేకులుకూడా లేవు. అంచేతఆగదు. క్షమించండి!

—ఫణిహారం వెంకట రెడ్డాచార్యులు (బొబ్బిలి)

వాలిగా అన్నాడు. అంటే డాక్టరు వూరికే వేళాకోళమాడ్తున్నాడనుకో. అయినా దాని రహస్యమేంటో జవహార్ అర్థం చేసుకున్నాడు. కాని యిలాంటి ఆస్తులు పంచుకోవటం విషయంలో తను ధ్యానముంచుతున్నాడని అందరూ అనుకుంటారేమో అని పాపం అతని మనసు చాలా బాధపడింది.

ఓ యేడాది గడచిపోయింది.

జవహర్ కిప్పుడు పదకొండో యేడు. బ్రూక్సు అనేదొర అత నికి కొత్త మేస్టారు. చాలా తెలివైనవాడు. అతని సాయంతో జవహర్ ఇంగ్లీషులో చాలా పుస్తకాలు చదివాడు లూయీస్ కారల్ అనే యింగ్లీషులో కవి అంటే అతనికి చాలా అభిమానం. 'జంగిల్ బుక్' 'కిమ్' ల్లాంటి చాలాపుస్తకా లాయన చదివి ఆనందించాడు. ఇంకా స్కాట్, తకరే, వెల్సు మొదలైన గొప్ప గొప్ప కవులు రాసిన కథ లెన్నెన్నో చదివాడు.

* * *

అదే సమయానికి ప్రపంచంలో పెద్దయుద్ధం బయల్దేరింది. ఆసియా ఖండంలో చాలా బుచ్చి దేశం జపాను పెద్ద ఆబోతు లాంటి దేశం రష్యాతో జగడ మాడ్తూంది.

జవహర్ ఈ యుద్ధంగురించి అంతా విని జపాను దేశానికే సాయం చెయ్యాలనుకున్నాడు. ఎందుకంటే జపాను తాలూకు పూర్వకథ లెన్నెన్నో చదివి అర్థం చేసుకున్నాడు. ఒకా నొకనాడు అతను పెద్దవాడై, మహా నాయకుడై మన హిందూ దేశాన్నే గాకుండా ఆసియా ఖండాన్నే యూరపు దొరల పరిపాలననుంచి ఎలా స్వతంత్రంగావించాలీ అని అప్పుడే కలలుకన్నాడు.



## దాగుడు అంకెలు

బాలా! ఈ గళ్లలో కొన్ని అంకెలు పక్షుల వెనకను దాగున్నాయి. అవేవో పోల్చుకో! పోల్చుకోడానికి ఒక కిటుకు వుంది. ఏమూడు (వరస) అంకెలు కూడినా, మొత్తం 15 వస్తుంది.

బొమ్మ పంపినవారు:

జె. చెన్నమూర్తి.

# అచ్చులతో గమ్మత్తు సామెతలు

అడుసు త్రొక్కనేల? కాలు కడగనేల?

ఆడవారితో ఆడనేల? ఆడి ఓడనేల?

ఇంటిదొంగను ఈశ్వరుడైన పట్టలేడు.

ఈతచెట్టుక్రింద పాలుత్రాగినా, కల్లు అంటారు.

ఉట్టి కెగురలేనమ్మా స్వర్గాని కెట్లెక్కుతుంది?

ఊరుమీద ఊరుపడిన, కరణంమీద కాస్తపడదు.

ఋణపడనేల? ఋణమడిగిన కోపపడనేల?

ఎవ్వరివెట్టి, వారికి ఆనందము.

ఏలేవాని ఎద్దుపోతేనేమి? కాచేవాని కన్నుపోతేనేమి?

ఐతే ఆదివారము, కాకుంటే సోమవారము.

ఒక్కొక్కరాయి తీస్తుంటే, కొండైన తరుగుతుంది.

ఓ పనివాడు కోరనిదీ, ఒండనివాడు ఆడనిదిలేదు.

ఔషధానికి అందరు లోకువే!

అందితే జుట్టు, అందకపోతె కాళ్లు.

అః అడుగులోనే హంస పాదమా!

కూర్పు: విగ్రహాల నరసింహారావు (బాపట్ల)

# సంక్రాంతి

స్వాగతమమ్మా
స్వాగతము

స్వర్ణ కాంతుల సంక్రాంతీ!

కిలకిలలాడే
కోయిల గుంపూ

నిగ నిగలాడే
పైరుల పెంపూ

కల కలలాడే
బాలల సొంపూ

ఆహ్హా హ్హా!
బలే ఇంపూ!

గంగిరెద్దుల
గడబిడలు

పిల్ల జెల్లలా
పక పకలు

గాజుల చేతుల
గల గలలూ

కొత్త అల్లుర
ధుమ ధుమలూ

అహ్హా చూచిన
బలే వినోదం!

—పి. ఎస్. నారాయణ (బొబ్బిలి)




ఆటల్లో ప్రమాదం

# లూసీ ఏదీ???!!!

కలవకొలను వివేకానందం, హైద్రాబాదు.

నిజంగా జరిగిన కథ

అనగా అనగా అనగా ఒక ఊరిలో ఒక చక్కనిబాల ఉండేది. ఆ బాలపేరు లూసీ. తల్లితండ్రులకు ఒక్కతే పిల్ల కాబట్టి అల్లారుముద్దుగా పెరిగింది, పెరిగి పెద్దదయింది, ఆమె తల్లి తండ్రులు ఆమెకు నచ్చిన అబ్బాయికి ఇచ్చి పెండ్లిచేయటానికి నిశ్చయించారు. పెళ్లి రేపు అనే వఱకు ఆ బాలలు ఇద్దరూ కులాసాగా ఆడుకుంటూ పాడుకుంటూ కబుర్లుచెప్పుకుంటూ ఉన్నారు. ఆరోజు సాయంత్రం లూసీ కనుపించలేదు. ప్రక్క ఇంటికి వెళ్లిందేమో అనుకున్నారు. రాత్రి ఇంటికి రాకపోగా ఇల్లు, వాకిలి



దొడ్డి అంతా వెతికారు. కాని కనుపించలేదు ! మరునాడు నూతులు, గుట్టలు, పొలాలన్ని గాలించారు. కాని ఏమీలాభం, ఎక్కడాలేదు. ఆఖరికిఏంచేస్తారు? ఏదయ్యామో ఎత్తుకోపోయి ఉంటుందని ఏడ్చి ఊరుకున్నారు.

ఇరవై ఏళ్లు గడచిపోయాయి. ఒకనాడు వాళ్ల అమ్మ ఎందుకో పాతసామాను గదిలోకి వెళ్లింది. ఏంజ్ఞాపకం వచ్చిందో వాళ్లింట్లో పెద్ద భోషాణం తెరిచిచూసింది. అందులో ఒక మనిషి అస్థిపంజరం కనుపించింది. వాళ్ల అమ్మకు కళ్లల్లో గిఱ్ఱున నీళ్లుతిరిగై. అందరు వచ్చిచూచారు. పెండ్లి ముందరరోజు ఆటలో ఈ అమ్మాయి ఇందులోదాగుంది. మూతకొక్కెం పడిపోయింది కాబట్టి బయటికి రాలేకపోయింది ! ఎవరూ ఈ భోషాణంలో దాగుంటుందని అనుకోలేదు.అప్పుడువెతకలేదు.

ఇదిజరిగి చాలాకాలమైంది కాని ఇప్పటికి నలుగురూ కూర్చున్నప్పుడు ఈ కథ చెప్పుకుంటూ ఉంటారు.


**SPECIAL OFFER FOR SANKRANTI (15% Discount)**

*World Standard :* 18 ct.—20 Microns Rolled Gold—
15 & 17 Red Rubies—10 Years Guaranteed Watches
WEST END & FAVRE LEUBA WATCHES ALSO AVAILABLE !




OTHER VARIETIES OF WATCHES IN OUR SPECIAL CATALOGUE

*Watch Repairing our Speciality*

**RIZVON & BROS.,**

**217, Netaji Subhas Chandra Bose Road, MADRAS-1**

# పాపం! రిక్షావాడు!

రచన : మా॥ శేషగిరిరావ్, మద్రాసు.


పాపము! ఆ రిక్షావాలా వెంకడు ఎప్పుడు చూచినా ఆ ఖాళీ రిక్షానే లాగుతూండే వాడు. ఎప్పుడన్నా ఒకరిద్దరు ఎక్కితే ఓ పావల అర్ధా వచ్చేవి; లేకపోతే లేదు. అందులో ఆ రిక్షా పాతదికూడానేమో సాధారణంగా ఎవరూ ఎక్కేవారు కాదు. దానికి తోడు వచ్చే డబ్బులు అందరికీ సరిపోవక పోవడం మూలాన వెంకడు మరీ బక్క చిక్కిపోయేడు. వచ్చే అర్ధరూపాయి డబ్బుల్లో రిక్షా అద్దె ఏమిస్తాడు? తను ఏమితింటాడు? తల్లి చనిపోయిన కూతురికి ఏమిపెడ్తాడు. దీనికితోడు కానిస్టేబిలుకి ఒక పావలా రోజూ ముడుపు చెల్లించుకోవాలయ్యె. ఎట్లాగో జీవితాన్ని సాగిస్తున్నాడు "పోనీ క్రొత్తబండి ఇప్పించండయ్యా" అని కామందుని వెంకడు బ్రతిమాలేడు కాని "నీవాలకానికా బండి చాల్లేరా!" అని కామందు కసిరేడు.

చేసేదేమీలేక వెంకడు కాళ్ళీడ్చుకొంటూ రిక్షాను లాగుకు వెళ్తున్నాడు. ఇంతట్లోకి ఒక ఆడగొంతుక "రిక్షా!" అని పిలచినట్లు విని ఆశతో వెనుదిరిగేడు. ఇంతట్లోకి రామయ్యరు భార్య వీధిలోకివచ్చి "ఏమిరా? రిక్షావాలా! స్టేషనుకు వస్తావా? ఏమియ్యమంటావు! అని అడిగింది.

"పావులా ఇయ్యండమ్మా" అని అడిగేడు. ఇంతట్లోకి ఆవిడ నాయకత్వంక్రింద ఒక పిల్లల పటాలం వచ్చింది, పెట్టె పరుపుతో సహా.

"ఏమిటమ్మా 5 మంది ఎక్కితే నారిక్షా ఆగుతుందా? దానికి తోడు పెట్టె పరుపుకూడా ఎట్లా? అయిదణాలు ఇయ్యండమ్మా" అని బ్రతిమాలేడు.

"పావులాకంటె ఎక్కువ ఏమీ ఇవ్వను. మొదటనే చెప్తిని కదా, జాస్తి అడుగుతుంటివి" అన్నది. ఇంకా కాసేపునానుస్తే



బేరమసలు పోతుందని వెంకడు ఒప్పుకున్నాడు.

సరిగా తిండి తినకపోవటంవల్ల వెంకడు బాగా శుష్కించి పోయేడు. తొందరగా రిక్షానులాగ లేకపోతున్నాడు. దానికి తోడు పైనుంచి అయ్యారమ్మ అరుపులు "ఏమిరా ఆలస్యము చేస్తుంటివి? బండి దాటిపోయ్యేది! తొందరగా లాగు" అని అరుస్తున్నది. దానికితోడు పిల్లలు కూడా అరుపులు మొదలెట్టేరు. చివరకు ఎట్లాగో స్టేషనుకు చేర్చేడు. పావులా చేతిలోపడ్డది.

"ఏయ్ రిక్షాను స్టాండులో ఆపక స్టేషనుదగ్గిరికి ఎందుకు తీసుకునచ్చావ్? తే! మామూలు తే! చప్పున ఇయ్యి" అన్నాడు డ్యూటీ కానిస్టేబు.

"ఆడమనిషి బాబూ పిల్లలు, కాస్త స్టేషనుదగ్గరకు పోనియ్యి అంటే తీసుకువచ్చేను. క్షమించండి బాబూ" అని ఏమేమో అన్నాడు "వీల్లేదు. ఇట్లా పడెయ్యి పావలా లేకపోతే పేరు చెప్పి పోలీస్ స్టేషనుకు రిక్షాను లాగుకురా! అన్నాడు.

"చేతికివచ్చిన పావులా కాస్తా కానిస్టేబిలు కొట్టుకు వెళ్ళేడు" అని పాపము ఆ రిక్షావాలా విచారించేడు. ఎంత మంది ఇట్లా బాధపడుతున్నారో!



# పసిపాపల బడి బస్సు

బాలలూ!

ఈపైె బొమ్మ చూచారా? ఇది పసిపాపలు బడికిపోయే బస్సు. ఈ బస్సు ప్రతిరోజూ పొద్దున్నే ఇంటింటికీ వెళ్లి పాపల్ని ఎక్కించుకొని బడికి తీసుకెళ్తుంది. మళ్లీ సాయంత్రం ఈబస్సు పాపల్ని జాగ్రత్తగా ఇంట్లో దిగపెడ్తుంది.

ఇది ఏ బడి బస్సు? ఎక్కడిది? ముందు ఇది చదువు.

మన దేశంలో పిల్లల చదువు కోసం బడులు అనేకం వున్నాయి. మునిసిపల్ బడులు, కార్పొరేషను బడులు, తాలూకా బోర్డు, పంచాయతీబోర్డు బడులు, ఇంకా ఇంకా వీధి బడులు ఎన్నో వున్నాయి. ఎన్ని వున్నా ఇంకా మనకి బడులు చాలవు తెలుసా?

సాధారణంగా పిల్లలకు అక్షరాభ్యాసం అయిన తరువాత తలిదండ్రులు పిల్లల్ని 5 ఏళ్లు వస్తేనేగాని బడికి పంపరు. అయిదేళ్లవరకు పాపలు ఇంట్లోనే అమ్మదగ్గర, అమ్మమ్మ దగ్గర కథలు, కబుర్లూ చెప్పుకుంటూ వుంటారు.

తలి తండ్రులు చదువుకున్నవారై, మంచివారైతే, తమ పిల్లలకు ఇంట్లో మంచి శిక్షణ ఇస్తారు, కాని ప్రతి తలితండ్రికీ అంత శ్రద్ధ తీసుకోడానికి తీరిక వుంటుందా? ఏ నౌకరీదో, ఏ

దాసీదో వాళ్లని చూస్తూ వుంటుంది. అంచేత పసిపాపలకు, ఆలేత మనస్సుల్లో కొన్ని దురభ్యాసాలూ, దురలవాట్లూ కలుగుతాయి.

అంచేత, పసిపాపలకు ప్రత్యేకంగా బడులు ఇప్పుడిప్పుడు పెడుతున్నారు. ఈ పసిపాపల బడులలో పాపలకు చెప్పే పాఠాలే వేరు. పాపలకు పుస్తకాలు అక్కరలేదు. అక్షరాలు నేర్పతేగా, పుస్తకాల అవుసరం? ఆటపాటలతోనే వాళ్లకి అంకెల గురించి, అక్షరాలగురించి, రంగులగురించి, ఆకారాలగురించి ఇంకా ఇంకా ఎన్నో విషయాలు బోధ పరుస్తారు.

ఇటువంటి పద్ధతులమీద నడిపే బడులలో చెప్పదగినది మదరాసులో మైలాపూరులో చిల్డ్రిన్సు గార్డెన్ స్కూలు ఒకటి. అలాగే త్యాగరాయ నగరంలో ఇంకోబడి ఈమధ్యనే కొత్తగా పెట్టారు. దానిపేరు "బాల మందిర్."

ఈ మధ్య బెంగుళూరు మా విలేఖరి వెళ్లాడు. అక్కడ శ్రీయం. ఎల్. శ్రీనివాసశాస్త్రి గారు, వారి సతీమణి మందరమ్మ గారు కలిసి హిమాంషు శిశు విహార్ అని ఒక పాపల పాఠశాలను అక్కడ పెట్టారు. అది మల్లేశ్వరంలో అదొక చక్కని ప్రదేశం. మా విలేఖరి ప్రవేశించే సరికి, ఒక హాలులో సుమారు నలభైమంది పాపలు కూర్చొని, వాళ్ల మేష్టారు చెప్తున్నదేదో కొందరు శ్రద్ధగాను, కొందరు అశ్రద్ధగాను వింటూన్నారు. భాష కన్నడ భాషయినా, చెప్పినదంతా మావిలేఖరికి బోధ పడుతూనే వుంది. పిల్లలు బలే హుషారుగా వున్నారు.

ఇంకో గదిలో చిన్న చిన్న కుర్చీలు, చిన్న చిన్న బల్లలు వున్నాయి. పిల్లలు, ఆ కుర్చీలను





తామే వేసుకోగలరు. ఎదురుగా బల్లమీద ఏవో రంగు రంగుల పిక్కలు, కర్ర చెక్కలు వుంటాయి. అవన్నీ రంగులవారీగానో, ఆకారం ప్రకారమో పేరుస్తారు. ఇ...

...ను... ...

...స్తా...

పలు ...

బిళ్ల...

స్తూ...

...గా...

తా...


యి...

పిల్లల అ...

భోజనాలు.

భోజనాలంటే మన ఇంట్లో అమ్మ బువ్వ కలుపుతే తినడం కాదు ఇక్కడ ఎవరి స్థలం వారిది. ఎవరి కంచం వారిది. ముందుగా పిల్లలందరూ కొళాయి దగ్గరకెళ్లి శుభ్రంగా చేతులు కడుగుకుంటారు. ఆ తరువాత భోజనంచేసి, ఎవరి తువాలు గుడ్డతో వారు చేతులు తుడుచుకుంటారు. ఆ పిల్లలకు అద్దం దువ్వెనా వుంటాయి. తమ జుట్టు తామే ఆ అద్దంలో సర్దుకుంటారు.

ఒక్కొక్కప్పుడు పిల్లలు పిక్నిక్ చేస్తారు. అంటే వన భోజనం అన్నమాట. అదుగో





అంటారు.

ఈ శిశు వి...లో మా ...శేఖరి ఇంకో ...నా చా... అదేమి ...ంటే - పిల్లలు నాటకాలు వేసుకొనే స్టేజి.


ఇంకో బొమ్మలో చూడండి పిల్లల పిక్ నిక్!

ఈ పిక్ నిక్ లోవున్న ఆనందం వేరే వాస్తుందా.?

ఇంకోరకం ఆనందం చూశారా?... ఇంకో బొమ్మ చూడండి ఆపిల్లలు ఎలాగ ఆడుకుంటున్నారో.

శాస్త్రిగారికి నాటకాలంటే బలేఇష్టం. పిల్లలకుకూడా నాటకాలలో వేషాలువేయడం ఇష్టం. అంచేత, ఎప్పటికీ పనికివచ్చేటట్టు ఒక పెద్ద అరుగుమీాద స్టేజి కట్టి వుంది. నాటకాలు ఎప్పుడు కావలిస్తే అప్పుడు వేసుకోవచ్చును. నృత్యంకూడా చేయ

పిల్లలు రెండు జట్లుగా విడిపోయి, ఒక పెద్ద పొడుగాటి తాడును ఇటూ అటూ లాగుతారు. దీనినే ఇంగ్లీషులో టగ్ - ఆఫ్ - వార్ ఆట



వచ్చును. ఈశిశువిహార్‌లో ఒక పియానోకూడా వుంది.

సాయంకాలం బడిమూసే ముందు పిల్లలందరూ వరుసగా ఒక హాలులో నిలబడి, ఒక పాటపాడి, వరుసగా నడుస్తూ హాలువిడిచి ఇళ్లకు పోతారు. మొదటిపేజీలో చూచారే బస్సు ఆబస్సే ఈ పిల్లల్ని ఇళ్లకు దిగబెడుతుంది.

పసిపాపల అభివృద్ధికై ఆబడి చేయుచున్న కృషి మెచ్చుకో తగ్గది.

మనం ఆంధ్రదేశంలో ప్రతి వూరిలోనూ ఇటువంటి బడులు పెట్టించాలి. ఏం?

## బంతి మాజిక్

బాలా!

బంతి నీయిష్టం వచ్చినట్టు నడుస్తుంది. "ఆగు!" అంటే ఆగుతుంది. "దిగు" అంటె దారంలో నుండి బరబర క్రిందకి జారుతుంది. ఈ మాజిక్ నువ్వు చేయగలవా?

ఇదుగో ఎలాగో చెప్తాను, జాగ్రత్తగా చదివి అర్థం చేసుకో!



జిగట మట్టితో నిమ్మకాయకంటె పెద్దది ఒక బంతిని చేయి. ఆ బంతికి మధ్యన, పైబొమ్మలోలాగ వంకరగా V ఆకారంలో రంధ్రముచేయి. బంతి ఆరిన తరువాత, దానికి రంగును పూసి, ఆ రంధ్రముగుండా ఒకనూలు త్రాడును ఎక్కించు.

ఇప్పుడు, ఆతాడు ఒకకొనను కాలి బొటకనవ్రేలితో నొక్కిపట్టుకొని, రెండవకొన చేతితో పట్టుకో. త్రాడు బిగించి పట్టుకుంటే బంతి అలాగే వుంటుంది. కొంచెం ఒదులుగా పట్టుకుంటే, బంతి క్రిందకు జారుతుంది. నీవు త్రాడును బిగించడం, ఒదులుచేయడం చూపరులకు తెలియకుండా చేయాలి.

ఈ గారడీ పంపినది: జె. చెన్నమూర్తి (అనకాపల్లి)

# పొడుంశాస్త్రి కథ

రచన : ఎస్. కామేశ్వరరావు (విజయనగరం)

బాలా! ఈ కథ యెప్పుడైనా విన్నావా! చాలా తమాషాగా వుంటుంది చదువు.

పూర్వం మైసూరు సంస్థానాన్ని పాలించే మహారాజుకి ఒక అలవాటువుండేది. అదేమిటంటే ప్రతీరోజూ సాయంకాలం దేవాలయానికి వెళ్ళటం. తిరిగివచ్చేటప్పుడు ఎవరన్నా తనకెదురుగా వుంటే వారిని "నీకేమికావాలి?" అని అడుగేవాడు. వెంటనే వారు జవాబుచెప్పాలి. ఎవరైనా నసికిన, తడబడిన యేవిధమగు ఆలస్యమైనాసరే మహారాజు ఇంటికివెళ్ళిపోతాడు, మరిమాట్లాడ్డు.

ఇలా మహారాజు కోవెల నుండి వచ్చేసమయానికి యెంతో మందిజనం ప్రతీదినం గుమికూడేవారు. మహారాజు యెవరివైపు తిరిగి యేంకావాలి అని ప్రశ్నిస్తే వారు వారికోరికలను తెల్పుకొని రాజుగారివల్ల బహుమతులు పొందుతూ వుండేవారు.

ఈ సంగతితెలిసి ఆవూరిలో వుండే సోమయ్యశాస్త్రి అనే బీదబ్రాహ్మణుడు రాజుగారి దర్శనం చేసుకొని తన దరిద్రం పోగొట్టుకుందామని ప్రతీరోజు కోవెలకు వస్తూవుండేవాడు. యెన్నోవారాలు, నెలలు గడిచేయి. కాని రాజుగారు యెప్పటికీ తనని చూడటంలేదు. యేంకావాలి అని ప్రశ్నించటంలేదు. యేం చేస్తాడు? తన దరిద్రానికి నొచ్చుకుంటూ, నిరాశచేసికొని ఇంటికి పోయేవాడు.


ప్రతీరోజూ రాజుగారి దర్శనానికివచ్చేటప్పుడుమాత్రం ఇలా అనుకునేవాడు. "ఈరోజు మహారాజు నన్నుగాని అడిగితే నా దరిద్రంపోయేట్టు, తరతరాలుగా వుండేటట్టు నాకు కావలసినంత ధనం యిప్పించండి అని కోరుకొంట'ను'" అనిఅనుకొని ఇంటిదగ్గర బయలుదేరేవాడు.

శాస్త్రిగారికిమాత్రం ఒక్క

దుర అలవాటువుండేది. అదే మిటంటే పొడుంపీల్చటం. గంటకి అధమం అరవైసార్లయినా పట్టు లాగితేగానివుండలేకపోయేవాడు.

ఒకరోజు దైవవసాత్తు మహారాజుగారు తనదగ్గర నిలబడ్డం తటస్థించింది. తక్షణం మహారాజుగారు శాస్త్రినిచూచి "నీకేమి కావాలి?" అని ప్రశ్నించేరు. తనకెప్పుడూ పొడుంపీల్చటమే అలవాటు కనుక తనువచ్చిన పని మరిచిపోయి, "నశ్యం పండిత లక్షణం" కాబట్టి ఒక్క పొడుంపట్టు యిలా వేయించండిమహారాజా అని చేయిజాపేడు. రాజుగారితో ఒక్కటే మాట, మరితిరుగులేదు. కనుక 'సరే బాపడా! రేపు నీకోరినప్రకారంపంపిస్తాను' అని చెప్పి సపరివారంగా కోటకి వెళ్ళిపోయేరు రాజుగారు.

శాస్త్రి యింటికవచ్చి యెంతో విచారించేడు. తాను ఒకటి తలంచితే దైవమొకటి తలంచేడు అన్నట్లు జరిగింది. యేదివచ్చినా మనమేలుకొరకే అన్నట్టు మర్నాడుదయమే మహారాజావారు ఒకవేగను పొడుండబ్బాలు పంపించేరు శాస్త్రిగారి యింటికి. వాటితో ఆఖరికి



పొడుంవ్యాపారం పెట్టుకున్నాడు సోమయ్యశాస్త్రి.

**పాపాయిలూ!** సాధారణంగా పొడుంపీల్చేవారికి **చేయిచాపే అలవాటువుంటుంది.** తనదగ్గర పొడుంవున్నాసరే యెవరన్నా పొడుండబ్బీ తీస్తే, ఒక్క చిట్టా **యిలా** వేస్తారా, **అని చేయి చాపుతారు.** ఈ అలవాటు ముదిరితే ఒక్కొక్కప్పుడు **మన సోమయ్యశాస్త్రిలాగ** ప్రమాదిస్తుంది.

# చదవండి

1. ఢిల్లీ చలో!
**( బోసు వీరుల అమరగాథ )**
రూ 1-8-0

2. పాతాళ లోకములో?
**( హింది కథల అనువాదములు )**
రూ 0-12-0

3. మేలి ముసుగు
**(కథల సంపుటి)** రూ 0-8-0

ఈ పుస్తకములు హిగ్గిన్ బాదమ్సు బుక్ స్టాల్సులో దొరకును; లేదా
శ్రీ దుర్గా బుక్ డిపో.,
**ఒంగోలు, అని రాయండి.**



## పేరు?

పేరులో ఏముంది? వేషం బాగుండి నటన బాగుంటే పేరు దానంతట అదే వస్తుంది.

ఈతార పేరు మన చిత్రకారుడు మరచి పోయాడు. ఈ బొమ్మనుచూచి తార పేరును పోల్చుకోవాలి. ఎవరు?

(ఢిల్లీ ట్రైజంకా)



# కిమ్మీరుడి ఆకలి కథ

రెండవ కథ

రచన : మహీధర నళినీ మోహన్ రావు, కాకినాడ

క్రిమ్మీరుడు ఒక బానిస.

వాడు బానిస అంటే ఏమిటో ఎరుగని ఒక అడవితెగలో పుట్టేడు. బానిసత్వం అంటే ఏమిటో ఎరుగని చిన్నవయస్సు వాడిది. అందుచేతనే వాడి ఆకలినిగురించి ఈకథ చెప్పుకుంటున్నాము.

ఒకరోజున వాడు తన యజమాని పశువులను తోలుకుని, ఊరిబయటకు వెళ్లేడు. అక్కడ కూర్చొని ఉండగా వాడికి ఆకలి వేసింది.

ఆకలివేస్తే దగ్గరలో ఉన్న ఇంట్లోకి వెళ్లి అక్కడ ఏముంటే అది పెట్టుకు తినెయ్యడం కిమ్మీరుడు పుట్టిన తెగవాళ్ల అలవాటు. తెగవారందరూ ఒకే ఇంట్లో వారిలాగ మసిలేవారు. ఇదినీది, ఇదినాది అనేభేదం వాళ్లకి తెలియదు.

ఆ అలవాటు ప్రకారమే కిమ్మీరుడు దగ్గరలో ఉన్న ఒక ఇంట్లోకి వెళ్లేడు. అక్కడ వంట ఇంట్లో పొయ్యిమీద మాంసం ఉడికి మంచివాసన వేస్తోంది. గిన్నెలోంచి తనకు కావలసింది పెట్టుకు తినేశాడు. వెళ్లిపోయి మందదగ్గర కూర్చున్నాడు.

ఆ రోజునే సాయంకాలము ఊరిపెద్ద పిలుస్తున్నాడని కిమ్మీరుణ్ణి తీసుకువెళ్లేరు. అక్కడ ఊళ్లో పెద్దలుకూడా చాలామంది కూర్చున్నారు. తాను ఏదో తప్పు చెయ్యడంచేత, విచారణ కోసం తీసుకువచ్చినట్లు వాడు వెంటనే గ్రహించాడు. ఏదేనా తప్పుచేసిన వాడిని విచారించేటందుకు అతని తెగవాళ్లుకూడా అల్లాగా కొలువు చేసేవారు. అయితే తనుచేసిన తప్పేమిటో అతనికి తెలియలేదు. కిమ్మీరుణ్ణి చూడగానే అక్కడ వున్న వారందరూ ఒక్కమారుగా

"అడుగో దొంగ!" అన్నారు.

"నువ్వు దొంగతనం చేశావు. ఔనా?" అని పెద్ద అతనిని అడిగేడు.

"దొంగ, దొంగతనం" అన్న మాటల్ని కిమ్మీరు ఎప్పుడూ వినలేదు. అతడు పుట్టిన తెగ వాళ్ళకి నాది అనుకొనే వస్తువులు లేవు. వాళ్ళల్లో ఎవరివద్ద ఏం ఉన్నా దానిని అందరూ వాడుకొనే వారు. అందుచేతనే వాడికి వాళ్ళ మాటలు అర్థంకాలేదు.

"ఏంచేశాను?"

"దొంగతనం"

"అంటే?"

"నువ్వు వీరిఇంట్లో అన్నం తినేశావు" అని ఆ పెద్ద అక్కడ కూర్చున్న ఒకరిని చూపించాడు.

కిమ్మీరుడు అటువంటి నేరం గురించి ఎప్పుడూ వినలేదు. వారంతా తనను హాస్యం ఆడుతున్నారనుకున్నాడు. ఇక్కడి వాళ్ళ ఆచారం చూడగా అతనికి నవ్వు వచ్చింది.

"తిన్నాను. నాకు ఆకలి వేసింది."

"ఆకలి వేసినా తినకూడదు. అది దొంగతనం." ఆ దేశంలో



అన్నంతినడాన్ని దొంగతనం అంటారు కాబోలు ననుకున్నాడు కిమ్మీరుడు.

"అదా, దొంగతనం అంటే?"

"కాను దొంగపనిచేశావా?"

కిమ్మీరుడు తల ఊపేడు, కాని, ఆమాత్రం మాట నేర్చడానికి ఇంత ఆర్భాటం ఎందుకో అతనికి తెలియలేదు. "దొంగ పని చేసేవు కనుక నీకు శిక్ష వేస్తాము" ఈమారు కిమ్మీరుడికి మరీ ఆశ్చర్యం వేసింది. దొంగతనం అనే పేరు పెడితే మాత్రం అన్నం తినడానికి శిక్ష ఏమిటి? "ఏంశిక్ష?"

ఊరిపెద్ద అక్కడ ఎదురుగా పాతిఉన్న ఒక రాతిని చూపించాడు. దానిమీద కోణాలు కోణాలుగా ఏమిటో చెక్కి ఉంది. ఊరిపెద్ద దానిని చదివేడు.

"ఎవరేనా పొరుగువాని ఇంట్లోకి వెళ్లి ఏమైనా తీసుకుంటే అతని చేతులు నరికి వెయ్యాలి."

కిమ్మీరుడు వాళ్లంతా తనని హాస్యం ఆడుతున్నారనే నిశ్చయం చేసుకున్నాడు. కాకపోతే రోజూ అన్నం తింటూఉండే వీళ్లు అల్లాంటి మాటలు ఎల్లాగ అంటారు? తానూ హాస్యంలో పాల్గొనాలనుకున్నాడు. తన చేతులు నవ్వుతూ చాచేడు. "నరకండి."

కిమ్మీరుడికి అన్నం తినడం దొంగతనం చెయ్యడం ఒకటి కాదని తెలియజెప్పడం ఊరిపెద్ద తరం అయిందికాదు. ఇంక ఈ అడవివాణ్ణి ఏంచేద్దాం అని తన ఊరివాళ్లతో ఆలోచించాడు. కుర్రవాడు కనుక నాలుగు కొరడా దెబ్బలతో వదిలి వెయ్యాలని అనుకొన్నారు. ఆమాట పెద్ద చెప్పేడు.

ఈమారు కిమ్మీరుడికి ఇందులో ఏదో తికమక ఉందని తోచింది. ఇది హాస్యంకాదని తెలుసుకున్నాడు.

"అది ఎందుకు?"


"ఇది న్యాయం"

మరో కొత్తమాట.

కిమ్మీరుడి వీపు నాలుగు కొరడా దెబ్బలకి చిట్లింది. కాని ఈకొత్త మాటలు ఏమిటో అసలు తెలియనేలేదు. నీది, నాది అనే మాటలతో న్యాయం కూడా మనభాషలోకి వచ్చిందని ఆ అడవివానికి ఏం తెలుసు?

బాలా !

ఈ ఆరు ముఖాలూ ఆనందంగా వున్నాయికదూ ? ఆ ముఖాలు అంత ఆనందంగా ఎందుకున్నాయో తెలుసా ? ఆరోగ్యంగా




వున్నాయి గనుక. ఆ ముఖాలను బాగాచూడు ! అవి ముఖాలేనా ? కావు. అవి పండ్లు. ఆరు పండ్లు ఒకే మోస్తరుగా వున్నాయా ?. లేవు. అందులో రెండు పండ్లు మాత్రము ఒకలాగే వున్నవి అవి ఏవి ?

(జవాబు యీ సంచికలోనే)

# తమాషాలు

## సైకిలు పంచరు

తండ్రి :-సోమూ! సైకిలుకు అంత పెద్ద పంచరు యెలా అయిందిరా?

సోము :-సీసామీాది నుంచి పోనిచ్చా నాన్నా.

తండ్రి :-సీసాను సమయానికి చూడలేదూ.

సోము :-లేదు నాన్నా! అది ఆ మనిషి జేబులో వుంది.

* * *

## మాటల ప్రయోగం

టీచరు :-'బలారి' యనగా ఇంద్రుడు అని అర్థము. ఓ రేయి రామం-దీన్ని నీ స్వంత వాక్యములో ప్రయోగింపుము.

విద్యార్థి:- మానాన్న సాయబా బలారి సర్వీసు కండక్టరండీ.

* *

## ఉపాయం

స్నేహితుడు :-నీ సైకిలు నెవరు దొంగలించినారో తెలిసి కూడ పోలీసు రిపోర్టు చెయ్యవేం?

నేను :-వాడు దానికి క్రొత్త టైరులు, ట్యూబులు వేసిన తర్వాత ఆపని చేస్తా.

—చక్రవర్తుల శేషాచార్య (కడప)

* * *

## గోదావరిలో!

రైలు గోదావరీ బ్రిడ్జిమీాద నుంచి వెళ్తోంది. ఒక ప్రయాణికుడు తొందరగా తన సామాను సర్దుకుంటూ కిటికీలోనుంచి తొంగి చూస్తున్నాడు. ఇంతలో ఇంకో క్రొత్త ఆయన :

"ఏమండీ! ఎక్కడ దిగుతారు?" అని అడిగాడు.

"ఈ గోదావరిలో" అని ఆతడు జవాబు చెప్పాడు.

నిజంగా ఆ గోదావరి నదిలోనికి గెంతేస్తాడేమో అని ఆ క్రొత్తమనిషి రైలు పెట్టెలోని గొలుసు లాగేశాడు.

"గోదావరి" అని స్టేషన్ వుందని ఆ ప్రయాణికుడికి పాపం తెలుస్తేగా!

—శ్రీపాద సుబ్రహ్మణ్యం (విశాఖపట్టణం)

## డి. ఇ. ఓ.

డి. ఇ. ఓ. అంటే డిస్ట్రిక్టు ఎడ్యుకేషనల్ ఆఫీసర్ అన్న మాట. అంటే జిల్లా విద్యాధికారి అన్నమాట. అంటే మన బడులు తనిఖీ చేయడానికి వస్తారే, ఆ అధికారి అన్నమాట.

ఒక డి. ఇ. ఓ. గారు మా బడికి వచ్చారు, వచ్చి ఇలా ప్రశ్న వేశారు.

డి. ఇ. ఓ.:- నేను ఈ రోజున ఇక్కడికి వస్తానని మీ మేష్టారు మీకు చెప్పారా?

అమాయకపు అబ్బాయి:-ఆఁ. చెప్పేరండీ. మీరు వచ్చిన తర్వాత ఆయన ఏవో ప్రశ్నలు వేస్తానని వాటికి సరియైన సమాధానాలు కూడా మాకు చెప్పేరండీ.

—శ్రీపాద సుబ్రహ్మణ్యం
(విశాఖపట్టణం)

## డ్రాయింగు పిరీడు

తండ్రి:-ఒరే శేషూ! మీకు ఏయే పిరీడ్లు క్లాసు సరదాగా వుంటుంది?

శేషు:-డ్రాయింగు పిరియడ్.

తండ్రి:-అయితే మీ డ్రాయింగు మేష్టారు బాగా చెప్తారన్న మాట.

శేషు:-కాదు. అసలు డ్రాయింగు మేష్టారు క్లాసుకి రానేరారు!

—పణిహారం వెంకటరెడ్డాచార్యులు
(బొబ్బిలి)

* * *

## సందేహం

తెల్ల ఆవు తెల్లపాలు ఇచ్చినచో నల్లఆవు నల్లపాలు ఎందుకు ఇయ్యదు?- నా సందేహం తీర్చరూ?

కొర్లాం వెంకట రమణయ్య
(నరసన్నపేట)

♦ పుట్టినరోజులు ♦

మీ పుట్టినరోజు పండుగకిగాని, మీ ఇంట్లో పెళ్లి పిలుపులకుగాని శుభలేఖలు మొదలగునవి, బాలా ప్రెస్సులో చక్కగా అచ్చువేసి యీయబడును. కొత్త టైపులు-అందమైన అచ్చు.

ఆఫీసు: 170, రాయపేట హైరోడ్డు మదరాసు-14.

బలేకథ;

# మోసం

రచన : పి. వి. రత్నం

అనగనగా ఒకఊళ్లో ఒకగొప్ప ధనవంతుడుండేవాడు. అతనికి ఒక్కడే కొడుకు. అతనిపేరు "జయరాజ్." చాలా ముద్దుగా పెరిగాడు. అయితే అతను ప్రతీ వాడినీ నమ్మేవాడు. స్నేహితులు ఎలా చెబితే అలా నడుచుకొనే వాడు. ఇది మంచిపనియా? కాదా? అని ఆలోచించేవాడు కాదు. వాళ్లు చెప్పినదంతా నిజమే యనుకొనేవాడు.

తండ్రి ఇదంతా చూసి చాలా విచారించాడు. జయరాజ్‌తో, "నాయనా! మనం బొంబాయి వెళ్లి అచ్చటవున్న గొప్ప గొప్ప వింతలన్నీ చూచివద్దాం. మరి అయితే మన దగ్గరవున్న బంగారం, డబ్బు ఇదంతా ఎచ్చటైనా దాచివేయాలి. నీకు నమ్మకమైన స్నేహితుడెవడైనా వుంటే చెప్పు. అతనిదగ్గర వుంచుదాం. మళ్లీ వచ్చి తీసుకోవచ్చు" అన్నాడు. "ఓ! అలానే. నా ప్రాణ స్నేహితుడు శర్మ వున్నాడు. అతడు చాలా నమ్మకమైనవాడు" అని జయరాజ్ చెప్పి తండ్రియిచ్చిన పెట్టె తీసుకొని శర్మకు యిచ్చివచ్చాడు.

తండ్రీ కొడుకులు బొంబాయి వెళ్లి నెలరోజులు వుండి అన్నీ చూసి సంతోషంతో తిరిగి వచ్చారు. జయరాజ్‌ను "వెళ్లి 'మనం యిచ్చిన పెట్టెను తీసుకొనిరా" యని చెప్పాడు తండ్రి.

జయరాజ్ శర్మదగ్గరికి వెళ్లాడు. ధనం పెట్టె అడిగాడు. శర్మకు కోపం వచ్చింది. "ఓయ్! జయరాజ్! చాలు చాలు నీ మర్యాద! నీ పెట్టెలో గులకరాళ్లు పెట్టి, అది ధనం పెట్టె అని అంటావా? నన్ను అవమాన పరచడానికి నువ్వూ మీ నాన్నా ఈ పని చేశారు!" అని ఆ గులకరాళ్ల పెట్టె ఇచ్చాడు.

జయరాజ్ ఆశ్చర్యంతో ఇంటికి వచ్చాడు. నాన్నగారు ఆ పెట్టెలో గులకరాళ్లు పెట్టి తన స్నేహితుడికి ఇచ్చినందుకు

కోపంతో, "నాన్నగారూ! మీరు ఇలాగ నా స్నేహితుణ్ణి అవమానపరుస్తారనుకోలేదు. అతను ఎంతో బాధ పడ్డాడు!" అని అన్నాడు.

అప్పుడు తండ్రి: "బాబూ! చూశావా మరి. అందులో కొన్ని విలువైన వస్తువులు వున్నాయని చెప్పి జాగ్రత్తగా వుంచమని చెప్తే అతడు అలా చేయక పెట్టెను ఎందుకు తెరవాలి? అతడు పెట్టె తెరచి చూచినవల్లనే కదా ఇందులో గులకరాళ్లు వున్నాయని తెలిసింది. మరి అయితే ఇదేనా నీ స్నేహితుని మంచిగుణం? అందులో నిజంగా బంగారం, డబ్బు వుంటే దొంగలించుదామనే వుద్దేశ్యంకదా అతనిది. అందువల్లనే ప్రతీవారినీ నమ్మకూడదంటాను. ఏమంటావు?

జయరాజ్ సిగ్గుతో తల వంచాడు.

చూశావా బాలా! ఎన్ని తీపి కబుర్లుపైకి చెప్పినా మనం ఎదుటివాడెటువంటి బుద్ధిగలవాడో ఆలోచించి స్నేహం చేయడం మంచిది. ఏం?

## మేకప్‌లో పోలికలు



# అద్దంలో కోతి

రచన : కాశీనాధుని లక్ష్మీనరసింహం (గణపవరం)

అగా అనగా ఒక వూళ్లో కృష్ణారావు అనే ఒక గొప్ప ధనవంతుడున్నాడు. ఆతనికి లేక లేక అందమైన ఒక కూతురు పుట్టింది. ఆ కూతురు పేరు మాలతి. మాలతి ఎంతో ముద్దుగా పెరిగింది. ఆడుకుందుకు బొమ్మలు పిడతలు, చదువుకుందుకు పిల్లల పుస్తకాలు, తొడుక్కుందుకు బట్టలు ఎన్నో వున్నాయి. మాలతికోసం ప్రత్యేకంగా ఒక గదివుంది. ఆ గదిలో చిన్న మంచం, చిన్న టేబిలు, చిన్న చిన్న కుర్చీలు అన్నీ వున్నాయి. మాలతి తన గదిలోనే, ఒక టేబిలుమీద బడి పుస్తకాలు పెట్టుకుంది. ఇంకో టేబిలుమీద దువ్వెన, బొట్టు, రిబ్బను, పిన్నులు, వాసననూనె, సబ్బుపెట్టె, అద్దం-అన్నీ వుంచుకుంటుంది. మాలతి తన గదిలోనికి ఎవ్వరినీ రానీయదు. ఎవరేనా వస్తే తన వస్తువులన్నీ పాడుచేస్తారని భయం.

ఒకనాడు సాయంత్రం మాలతి, బజారుకెళ్లి ఒక కొత్త అద్దం కొనుక్కుంది.

షాపువాడు ఆ అద్దాన్ని ఒక అట్టపెట్టెలో పెట్టి, చుట్టూ దారం కట్టి ఇచ్చాడు. మాలతి ఇంటికి రాగానే ఆ అద్దాన్ని ఎవరికీ చూపించకుండా తన గదిలో టేబిలు డ్రాయరులో దాచింది. ఆ మర్నాడు పొద్దున్న ఆ అద్దాన్ని తన టేబిలుమీద పెట్టుదామని అనుకుంది.

ఆ రాత్రి మాలతికి నిద్రలో ఒక కల వచ్చింది. ఆ కలలో ఎవ్వరో ఒక భూతం వచ్చి తన అందమైన ముఖాన్ని మార్చివేసినట్టు కలవచ్చింది. పొద్దున్నే మాలతి గబగబ లేచి కొత్త అద్దాన్ని తీసి తనముఖం చూచుకుంది. నిజమే! ఆ అద్దంలో మాలతి ముఖం వికారంగా కనిపించింది. పెద్ద ముక్కు, వంకర

టెంకర నోరు, సొట్ట బుగ్గలు, చీపికళ్లు – అసహ్యంగా దెయ్యంలాగ కనిపించింది.

"అయ్యో! దేముడా! నేనెంత కురూపిని! నన్నిలాగ ఎందుకు పుట్టించావు?" అని మాలతి వెక్కి వెక్కి ఏడ్చింది.



మాలతి తన గదిలోనికి వెళ్లి ఆఅద్దంలో తనముఖం చూసుకున్నప్పుడల్లా ఇలా ఏడుస్తూ, దుఃఖిస్తూవుండేది.

అప్పుడప్పుడు వాళ్లింటికి స్నేహితులు, చుట్టాలు వచ్చినప్పుడల్లా 'మీ మాలతి ఎంతో అందమైంది' అనేవారు. ఈమాట గనక మాలతివింటే ఆపళంగా తన గదిలోకి వచ్చేసి ఏడుస్తూ కూచునేది. కారణం ఏమిటో తెలుసా! తన్నందరూ హేళన చేస్తున్నారని, అదంతా తాను కురూపి అని ఆక్షేపణ చెయ్యడం అని అనుకునేది. కాస్సేపు ఏడిచేడిచి ఊరుకునేది.

ఒకరోజున వాళ్లింటికి ఎవళ్లో పేరంటానికి పిలవడానికి ఒచ్చారు. అప్పుడు మాలతిఅక్కడే ఉంది. మాలతి ముఖానకూడ బొట్టుపెడుతూ ఆవిడ–'మీ మాలతి ఎంతో ముద్దొస్తో ఉంటుందండి, చాల అందంగా ఉంటుంది. చంద్రబింబంలాంటి మొఖం'– అని ఎంతో పొగిడింది. ఈ మాటలు వినేసరికి మాలతికి కోపం, విచారం వచ్చాయి. తన గదిలోకి పోయి ఎక్కెట్టి ఏడవడం మొదలెట్టింది. ఇంతట్లోనే వాళ్ల అమ్మ గదిలోనికివచ్చి 'ఎందుకే ఏడుస్తున్నావు?' అని అడిగింది. 'నాకు దేవుడింతే అందం యిచ్చాడు. కురూపిలా పుట్టించాడు. అందరిచేత ఆక్షేపణలు పడమన్నాడు' అంది.

నువ్వు నిజంగా చాల అందమైనదానివేనమ్మా అని అంటూ ఆమె తల్లి తల దువ్వుకుందామని అద్దందగ్గరికెళ్లి తలదువ్వుకోబోయేసరికి తనుకూడ అద్దంలో చాలవికృతంగా కనబడ్డది! కాస్సేపు నిదానించి చూసి, సూక్ష్మగ్రాహి గనక అసలు సంగతి తెలుసుకున్నది. వెంటనే వెళ్లియింకో అద్దంపట్టుకొచ్చి మాలతికిచ్చింది. మాలతి అందులో తన ముఖంచూచుకుని పట్టరాని ఆనందంతో, విస్ఫారిన ముఖారవిందంతో- "ఆ అద్దంలో అల్లా కనబడుతున్నానేమి!" అంది.

ఆ అద్దం సమతలంగా లేదమ్మా. ఎగుడు దిగుడుగా, ఎత్తు పల్లాలుగా ఉండండచేత అల్లా కనబడుతున్నావు. అంతే కాని నువ్వు నిజంగా చాల అందమైనదానివి. రేపు నాన్నగారితో చెప్పి, ఆ అద్దం తీయించేసి మంచి అద్దం పెట్టించుతాలే. ఇకముందెపుడూ ఇటువంటి చౌకబేరం అద్దాలు కొనకు. తెలిసిందా? అని బుజ్జగించింది.

మంచి అద్దాలు కొనకపోతే మీరుకూడా అద్దంలో కోతులవుతారు జాగ్రత్త!



వాహినీవారి "గుణసుందరి కథ" లో
కిరాతకుడు, కిరాతకి నృత్యం.




(అనువాదం)

జరిగినకథ:-ఒక చేపలవాడి వలలో ఒక బంగారుచేప పడింది. "నన్ను వదిలేస్తే నీ పూరిగుడిసె ఒకపెద్ద మేడ అయిపోతుంది. నువ్వు గొప్పవాడివయి పోతావు. కాని ఈ రహస్యం ఎవరికైనా చెప్తే అంతా మాయమవుతుం" దని చెప్పింది ఆచేప. చేపలవాడు ఆచేపని వదలి ఇంటికివచ్చి, ఆరహస్యం తన పెళ్లానికి చెప్పేస్తాడు. వెంటనే తన భవనం తిరిగి పూరిగుడిసెగా మారి పోయింది! ఇక చదవండి—

ఆ భవనం ఎప్పుడు మాయమయి పోయిందో ఆ రహస్యం ఆ సంగతులూ అన్నీ వాడి పెళ్లాం యిట్టే మరచిపోయింది.

అసలు సంగతేమంటే ఆ బంగారుచేప మళ్లీ వాడి వలలోనే పడింది! అది "ఈ మాటు కూడా నన్ను వదిలిపెడితే నీభవనంఅన్నీ తిరిగి వచ్చేటట్లు చేస్తాను" అంది.

"అంతకంటేనా" అన్నాడు చేపలవాడు.

మళ్ళీ మన అదృష్టం పండిందిరా అనుకుని చాలా సంతోషించాడు. కానీ పెళ్లాంగారు మాత్రం నోరు మూసుకుని వుండదుగా! మళ్ళీ ఇవన్నీ ఎక్కడ నుంచి వచ్చాయండీ, అని సతాయించడం మొదలెట్టింది. మళ్ళీ చేపమాటలు మరచిపోయి రహస్యం చెప్పేశాడు. సరే యిక మళ్ళీ పూరి గుడిసే, కుక్కమంచం తయారు.

కానీ వాడి అదృష్టం ఏమిటోగానీ మూడో మాటుకూడా వీడి వలలోనే ఆ చేప పడింది. ఇక దానికీ విసిగెత్తింది కాబోలు "ఇక నీవల తప్పించుకుని వుండడానికి వీలులేకుండా వుంది. మీ యింటికి నన్ను తీసికెళ్ళు. నన్ను ఆరు ముక్కలుగా కొయ్యి. రెండు నీ భార్యగారికియ్యి కూర వండుకుని తినమని. రెండు ముక్కలు నీ గుర్రానికి పెట్టు. ఇక మిగిలిన రెండు ముక్కలూ తోటలో

పాతిపెట్టు. నీకు శుభం కలుగుతుంది" అంది.

ఇంటికెళ్ళి సరిగ్గా తప్పకుండా ఆచేప చెప్పినట్టుగా చేశాడు. కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజున తనుతోటలో పాతిపెట్టిన ముక్కలనుండి రెండు చక్కని బంగారు మొక్కలు మొలిచాయి. తన గుర్రం రెండు బంగారు పిల్లల్ని పెట్టింది. తన భార్య ముద్దులు మూటలు కట్టే బంగారు కవల పిల్లల్ని కనింది. పిల్లలిద్దరూ అందమయిన యువకులుగా తయారయ్యారు. వీళ్ళతోకూడా గుర్రపు పిల్లలూ, బంగారు మొక్కలూ పెరిగాయి.

కొన్నాళ్ళకి వాళ్ళు కథలు చదవగా వివిధ దేశాలలో వింతలు బోలెడన్ని తెలిశాయి. కానీ అవి కళ్ళారా చూడాలని బుద్ధి పుట్టింది. తిన్నగా తండ్రి దగ్గరకు వెళ్ళారు.

"నాన్న గారూ! ఇదిగో ఫలానా ఫలానా మాకోరిక, బయలు దేరుతున్నాం. శలవియ్యండి. మీ అనుజ్ఞకొరకు చూస్తున్నాం" అన్నారు. మరి వాళ్లు యీ కాలపు కుర్రాళ్ళు కాదుగా. శాస్త్ర తలిదండ్రులంటే భక్తి గౌరవం వున్నట్టున్నాయి. తల్లి యిది వినగానే "అయ్యో నాయనలారా. ఒంటరిగా ఎలా వెడతార్రా! అడవుల్లో సింహాలూ గట్రా వుంటా యేమో రా" అని బోరుమంది. తండ్రి సరే వెడుతున్నారు కదా. మరి మీ క్షేమ సమాచారాలూ అవీ ఎలాగ నాకు తెలుస్తాయిరా అబ్బాయిలూ" అన్నాడు. "దానికేం బెంగ పెట్టుకోక్కర్లేదు, నాన్నారూ! తోటలో బంగారు మొక్కలు చూస్తోండండి, కొద్దిగా వాడినట్టుంటే మాకు కొద్ది జ్వరంతగిలి వున్నట్లో లేకకష్టాల్లో వున్నట్లో, పూర్తిగా వాడిపోతే మేము చనిపోయినట్టూనూ" అని చెప్పి తల్లిని సముదాయించి యిద్దరు చెరొక బంగారు గుర్రంమీద టకటకా బయలుదేరారు.

అలాగ కొంతదూరం తర్వాత ఒక హోటలులాటి దానికి (మన అయ్యరు హోటలు కాదు సుమా అలాటి బాపతే అయి వుంటుంది) వచ్చారు. అక్కడ వున్న వాళ్లందరూ వీరిద్దరూ

లోపల కొచ్చేటప్పటికీ — మరి పుట్టుకతోనే బంగారు రంగుతో, బంగారు బట్టలూ వాటితో పుట్టారుగా-అందరూ వాళ్ళని చూచి ఎప్పుడూ చూడలేదురా అంటూ నవ్వుతూ, పరిహాసంచేస్తూ వెకిలి గోలచేయడం మొదలు పెట్టారు. ఈ యిద్దరు పిల్లల్లో ఒకడు కొద్దిగా సిగ్గయినవాడు.

వాడు ఈ కేలి చేయడం చూడగానే నేనిక రానురా బాబూ అని యింటికి దారితీశాడు. రెండో వాడున్నాడు చూశారూ! మంచి ధైర్యం కలవాడు. ఎవడేమన్నా లెక్ఖలేదు. భయం అన్నది యీ కుర్రాడి నిఘంటువులో లేనే లేదు. ముందుకు ఉడాయించాడు గుర్రాన్ని. వెళ్ళగా వెళ్ళగా ఒక పెద్ద అడవి మొదలికి వచ్చాడు. "అబ్బాయీ! నువ్వు చూస్తే మంచి కుర్రాడిలా అగబడుతున్నావ్. అడవిలోకి వెళ్ళకు. అడవంతా దారిదోపిడిగాళ్ళమకాం. అసలే నువ్వు బం



గారంలాంటి కుర్రాడివి. నీగుర్రం చూస్తే అలాగేవుంది. మిమ్మల్ని చూశారంటే ఆదొంగ వెధవలసలు వదలిపెట్టరు. అనవసరంగా వాళ్ళ చేతుల్లో ఎందుకు చచ్చిపోవాలి? వెళ్ళొద్దంటే వెళ్ళొద్దని గ్రామస్థులు అన్ని విధాలా చెప్పారు. అబ్బే మనవాడలాంటి వాటికి జడిసేరకం కాదని మొదటే చెప్పాగా! అయితే ఒకటి లెండి, ఆధైర్యానికి తగిన బుర్ర వుంది. వెంటనే పెద్దపెద్ద తోళ్ళు కొట్టుకొచ్చాడు వూరంతా తిరిగి. గుర్రంమీదా తన మీదా పూర్తిగా కప్పేశాడు. టీక్ టాక్ అంటూ అడవిలో ప్రవేశించాడు.

దొంగలు చూశారు. ఓస్! వీడెవడో పిట్టలు కొట్టుకునేవాడు. వాడిదగ్గర చిల్లికానీయేనా వుండదని వదిలేశారు. అడవి దాటేశాడు, ఎలాగయితేనేం, ఒక చిన్న వూరివద్దకు వచ్చాడు. ఆవూళ్ళో ఒక కోటీశ్వరుడి యిల్లు



వుంది. ఆ యింటి ముంగట ఆ కోటీశ్వరుడి ముద్దు కూంతురు పదిహేనేళ్ళ కన్య అప్సరసలా తళుక్కుమంది. మనవాడు ఆ అమ్మాయిని చూడగానే అమాంతంగా ప్రేమించేసి వూరుక్కున్నాడు. తిన్నంగా ఆ అమ్మాయి దగ్గర కెళ్ళిపోయాడు జంకూ గొంకూ లేకుండా. "నువ్వంటే నాకు చాలా యిష్టంగా వుంది. నన్ను పెళ్ళి చేస్కుంటావా పిల్లా" అన్నాడు. ఆ అమ్మాయి కూడా మన్మధుడిలాంటి యీ కుర్రాణ్ణి చూడగానే తనువల్ల కాదని చెప్పలేకపోయింది. లోపలికి తీసికెళ్ళింది. యింట్లో అంతా తన యిష్టారాజ్యమేగా! సామగ్రులన్నీ వుండనే వున్నాయి. చక్కగా పెళ్ళి చేసుకున్నారు. ఇంతలో ఆ అమ్మాయి నాన్న వచ్చాడు. అతనికి బలే ఆశ్చర్యం వేసింది. అసలు ముందు పెళ్ళికొడుకుని చూపించమన్నాడు. మనవాడు యింకా ఆతోళ్ళు కప్పుకునే వున్నాడు. నీడెవడో గర్భ దరిద్రుడిలా వున్నాడురా అని ఆ పిల్లతండ్రి సీమమిరపకాయలు నాలుగు పంటికిందా, నాలుగు కంట్లోనూ పెడితే ఎలా ఎగురుతారో అలా గెంతులెయ్యడం మొదలెట్టాడు. "హాత్తెరి. కోటీశ్వరుడనయిన నా కూతుర్ని పిట్టలు కొట్టుకునే దౌర్భాగ్యుడికి యిచ్చి పెళ్ళి చేస్తానా' అని. (ఇంకావుంది)

# గమ్మత్తు పద్యం

···· * ····

గంగి Cow Milk Spoon డైన Enough
Pot డైన నేమి Ass Milk ?
భక్తి కలుగు Food పట్టెడైనను Enough
విశ్వదాభిరామ Hear వేమా !

కూర్పు : యస్.వి.ఎ. సూర్యనారాయణ (మదరాసు)

# బొమ్మల పజిల్ చేస్తావా?




( ప్రక్క పేజీలో చదువు )

ఈ ప్రక్క పేజీలో 16 బొమ్మలున్నాయి. ఒక్కొక్క బొమ్మ బాగాచూడు. అందులో కొట్టివేసిన అక్షరమునుబట్టి ఆ బొమ్మ ఏమిటో పోల్చుకో. అక్షరంకొట్టీగా మిగిలిన అక్షరం తెలుసుకొని, ఆ అక్షరాన్ని ఎదురుగావున్న ఖాళీ గదిలోరాయి. ఎలాగంటే— మొదటి బొమ్మ "బాతు"; అందులో 'తు' కొట్టి వేయబడింది. మిగిలిన అక్షరం "బా", ఖాళీ గదిలో రాయవలెను. అలాగే మిగిలిన 15 బొమ్మలుచూచి, 15 గదులు నింపవలెను. తరువాత వరుసగా ఆ అక్షరాలు చదువు.

కూర్పు:—వి. చిట్టి రామారావు (వులిగడ్డ)

---


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే
బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

యీయండి.

**ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.**

వివరములకు:

డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు అండ్ బ్రదరు,
11 దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు,

కుంభకోణం బ్రాంచి;
నెం. 7, సారంగపాణి కోవిల్
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి;
నెం. 15, పుగళైపిళ్ళై వీధి,
తెప్పకొలం



# పొడుపుకథలు

కూర్పు : లింగంపల్లి వెంకట్రావు (గణపవరం)

---

1. ఆకాశాన అప్పన్న, నేలకుప్పన్న, బొడినాకన్న, పిండి పిసకన్న అది ఏమిటి?
2. దొంగిలించలేదు, దొంగసొమ్ము తీయలేదు, అబద్ధమాడలేదు సంకెళ్ళలో బడ్డాడు. ఎవరు?
3. బండి ఎక్కడు, గుఱ్ఱం ఎక్కడు, నడవనిబాలుడు యింటి ముంగిటికి తిరుగుతాడు. అది ఏమిటి?
4. ఆబాబు యీబాబు పోట్లాడితే కూనరాములు వచ్చి తగవుతీర్చేడు. అది ఏమిటి?
5. మిద్దెలో మిరపచెట్టు నీళ్ళులేక ఎండిపోయె. అది ఏమిటి?
6. ఆకొండకు ఈకొండకు యినుప సంకిళ్లు, అది ఏమిటి?
7. వెండిబెత్తము, బంగారు దుప్పట్లు, గుఱ్ఱపు వెంట్రుకలు. అది ఏమిటి?
8. పదహారు కొమ్మల వటవృక్షం, పడితే లేవదు. అది ఏమిటి!
9. మామకొడుక్కి తలలేదు. కాళ్ళు లేవు. అదియేమిటి?
10. నాలుక తెరచి నక్కపడుకుంటే ముసలమ్మవచ్చి మూడు చేటల గడ్డిమేసింది. అది ఏమిటి?
11. ఇక్కడ కట్టినకట్లు యినుపకట్లు. మా ఊరి చెఱువులో మాయమైపోయె! అది ఏమిటి?
12. అక్కయింటిలో దీపంపెడితే చెల్లెలింట్లో తెలుస్తుంది. అది ఏమిటి?

(జవాబులు ఈ సంచికలోనే)

# దొంగరాయికథ

(ఒక చీనాదేశపు కథ)

అనగా అనగా ఒక పల్లెటూరులో ఒక బీదముసలిమనిషి వుండేది. పాపం, ఆ ముసలిది రోజూ జంతికలు చేసి, ఆ జంతికలన్నిటినీ ఒక బుట్టలో పెట్టి తన కొడుక్కి ఇచ్చేది. ఆ కొడుకు వాటిని దగ్గరగావున్న పట్టణానికి తీసుకెళ్లి తిరిగితిరిగి అమ్మి, ఆ డబ్బును సాయంత్రం ఇంటికి తెచ్చేవాడు.

ఒకనాడు ఆకొడుకు జంతికలు అమ్మి ఇంటికి తిరిగివస్తూవుండగా త్రోవలో రోడ్డుకి కొంతదూరంలో ఒక బ్యాండుమేళం పాట వినిపించింది. ఆ ఉత్సవం ఏమిటో చూద్దామని ఆ కుర్రాడు ఏమి చేశాడూ - తన దగ్గర వున్న డబ్బుల్ని బుట్టలో పెట్టి, ఆబుట్టని ఒక పెద్దరాతికింద దాచి వెళ్లాడు. సంబరంచూచి తిరిగివచ్చాడు. రాతికిందచూచాడు. బుట్టలేదు! బుట్టను ఎవరో దొంగలించారు! పాపం! ఆ కుర్రాడు ఏడుస్తూ అవూరు న్యాయాధికారి దగ్గరికి వచ్చాడు. జరిగిన సంగతంతా చెప్పాడు. అప్పుడు ఆన్యాయాధికారి ఇలా అన్నాడు.

"అబ్బాయీ! నీవు ఏ రాతికింద నీ డబ్బులబుట్ట దాచావో ఆరాయిని చూపించు" అని అన్నాడు.

కుర్రాడు, న్యాయాధిపతి, నౌఖర్లు అందరూ ఆవూరిబయట రోడ్డుపక్కనవున్న రాతిదగ్గరికి వెళ్లారు.

"ఇదుగో మహారాజ్ ఈ రాతికిందే!" అని ఆకుర్రాడు చెప్పాడు. న్యాయాధిపతి, ఆ రాతిని ఇటూ అటూ పరీక్షించాడు. ఈ తమాషా చూడడానికి అక్కడ దగ్గరగా జరుగుచున్న ఉత్సవంనుంచి గుంపుగుంపులుగా మనుష్యులు వచ్చారు. న్యాయాధికారి ఆ రాతినిచూసి, "భటులారా! ఈ దొంగారాయిని కైదీచేయుడు!" అని అన్నాడు.

వెంటనే భటులు ఆ రాతికి ఇనుప సంకెళ్లు వేసేరు.

"ఈ రాతిని రేపు కోర్టులో పెట్టి విచారణచేస్తాను. శిక్షిస్తాను"-అంటూ ఆ న్యాయాధిపతి వెళ్లిపోయాడు. భటులు ఆ దొంగరాయిని మోసుకొని కోర్టుకి తీసుకొచ్చారు.

అరెరె! రాయి దొంగతనం చేయడమేమిటి! దానిని ఖైదీ చేయడమేమిటి? విచారణ ఏమిటి? బలే తమాషాగావుందే అంటూ ఆ తమాషా విచారణ చూడడానికి, న్యాయస్థానమంతా ప్రజలతో నిండిపోయింది.

న్యాయాధిపతి విచారణ ప్రారంభించాడు. ముందుగా ఆ కుర్రాడ్ని అడిగాడు. కుర్రాడు జరిగిన సంగతంతా పూసగుచ్చినట్టు చెప్పాడు. తరువాత ఆన్యాయాధిపతి ఆరాయివైపుచూసి ఇలాగ తీర్పు చెప్పాడు.

"ఈ అబ్బాయి సొమ్ము ఈ రాయే దొంగిలించింది. కనుక



ఈ రాతికి 50 కొరడా దెబ్బలు శిక్ష వేశాను. కొట్టండి!" అని తీర్పు చెప్పాడు.

భటులు వెంటనే కొరడాతీసి సుళ్ సుళ్ మని రాతిని కొట్టడం మొదలెట్టారు.

ఈ తమాషా చూస్తున్న ప్రజలు నవ్వు ఆపుకోలేక పక పకాన నవ్వేరు.

న్యాయాధిపతి అది చూచి ఒక కేక వేశాడు. "ఇది నవ్వు లాట కాదు! పరిహాసం కాదు. ఇది న్యాయస్థానం! మీరందరూ ఇలానవ్వి ఈ న్యాయస్థానానికి పరువు నష్టం తెచ్చారు. ఆగండి! అందరూ ఆగండి! మీరు ఈ న్యాయస్థానమును ఎగతాళి చేసినందుకు మీరు ఒక్కొక్క అణా జరిమానా! ఆ అణాను మీరు ఇప్పుడే చెల్లించి మరీ బైటికి వెళ్లాలి" అని అన్నాడు.

వెంటనే ద్వారందగ్గర ఇద్దరు భటులు నిలుచున్నారు. న్యాయాధికారి, నీళ్లతో సగంవరకు నిండివున్న ఒక గాజుసీసాను అక్కడ ద్వారందగ్గర పెట్టేడు. ప్రతీ వాడూ ఆ సీసాలో జరిమానా అణాను వేసి మరీవెళ్లాలిఅన్నాడు.

ఒక్కొక్కరు వరుసగా వచ్చి ఒక్కొక్క అణాను ఆ గాజు సీసాలో వేసి వెళ్తున్నారు. అందరూ వెళ్లగా ఆఖరికి ఒకడు మిగిలాడు. వాడుకూడా ఒక అణా ఆ సీసాలో వేశాడు.

ఇదంతా చూస్తున్న ఆ న్యాయాధిపతి వెంటనే! "వీడే! వీడే దొంగ! పట్టుకోండి!" అని అన్నాడు. భటులు ఆ మనిషిని పట్టుకున్నారు. వాడి ఇల్లువెతికారు. వాడి ఇంట్లో నిజంగానే ఆ అబ్బాయి బుట్ట, డబ్బులు దొరికాయి! న్యాయాధిపతి ఆ నిజమైన దొంగకు కఠినశిక్ష విధించాడు.

బాలా! న్యాయాధిపతి ఆ దొంగని ఎలాగ పోల్చుకున్నాడని అడగగలవు. జంతికలు ప్రతి దినం అమ్ముకుంటున్న వాడి బుట్టలో తప్పకుండా నూనెవుంటుంది. ఆబుట్టలోవున్న డబ్బులకి కూడా నూనె అంటుకొనివుంటుంది. గాజు సీసా నీటిలో ఆ చమురు తగిలిన అణా వేయగానే నూనె తేలిపోతుంది. దానిని బట్టి ఆ న్యాయాధిపతి పోల్చుకున్నాడు తెలుసా?

# విందు

## పిల్లల నాటిక

రచన

సిద్ధాంతి మల్లిఖార్జునం

### I

[యమునానదీ తీరము: చెట్ల నీడల క్రింద అక్కడక్కడ ఆవులు, దూడలు, ఎద్దులు మేస్తూంటాయి. అప్పుడప్పుడు వాటి అరుపులు, మెడలో గజ్జలు, గంటలు మోగుతూంటాయి. చెట్లమీద కూర్చున్న పక్షుల పాటలు విని పిస్తూంటాయి.]

**(రాధ, 12 ఏండ్లుంటాయి ప్రవేశం. ఎవరినో వెదుకుతూ వస్తుంది.)**

రాధ—(పాట)

రావోయి చిన్నికృష్ణా
వేణు వూదుచు రావోయి
చిరునవ్వులతో రావోయి
వెన్నమీగడలు తేవోయి ॥ రా ॥
మిల మిల మెరిసే
యమునా నదిలో
జలకమాడుదము ॥ రా ॥

అబ్బబ్బ! ఎక్కడ వెదికినా వీడు కనిపించడు. ఇంట్లో కానీ పైనా వుంటేగా! నిన్న పొద్దున ఎప్పుడో కనిపించాడు. మళ్ళీ అంతు లేదు. నిన్న తిన్న వెన్నముద్ద లెంతో బాగున్నాయి. పోనీ మళ్లీ తెస్తాడేమో నంటే కనిపిస్తేగా. నేనే వెళ్లి వెన్నముద్దలు దొంగిలించుకొని వస్తామంటే చేత కాదుగా! భయం. దానికంతా మా దొంగ కృష్ణుడేసరి. అయినా యింతసేపు ఎక్కడికి వెళ్లాడో? స్నేహితులెవ్వరు కనిపించలేదు. ఆవులుకూడా యిక్కడే వున్నాయే. అయితే వీడెక్కడికీ పోడు. ఈకృష్ణుడు దొంగల్లోకి దొంగ. ఎక్కడో దాక్కొనుంటాడు వెన్నముద్దలు మింగుతూ. నాకు కనబడితే పెట్టాలిగా. అమ్మో ఎంత దొంగ! ఎంత దొంగ! చూస్తాగా నాకెట్లా పెట్టకుండా పోతాడో.

అబ్బ! యికనే వెదక లేనమ్మా. (కూర్చుంటుంది) కృష్ణా! కృష్ణా! ఒరేయ్ కృష్ణా! (దూరాన్నుంచి 'ఓయ్' అన్న శబ్దం వినిపిస్తుంది) అదుగో యిక్కడే తిరుగుతున్నాడు. దొంగ! (అటు యిటు చూచి) కృష్ణా యిదుగో యిక్కడున్నారా. తొందరగా పరుగెత్తు.

కృ : (వస్తూ) రాధా ఎక్కడున్నావే.

రాధ :-(సంతోషంతో) ఇక్కడేరా. కండ్లు కనపడటం లేదట్రా.

కృ :-అరెరే. దొంగ! ఇక్కడున్నావా (అంటూ వచ్చి రెండుచేతులు పట్టుకొని అల్లాబిల్లి తిరుగుతారు) రాధా! పొద్దున మీా యింటికి వచ్చాను. నీవు కనపడలేదే? ఎక్కడికెళ్లావే?

రా :-నీకోసం మీాయింటికెళ్లాను.

కృ :-అంతా అబద్ధాలు.

రా :-చాల్లేరా, నీ దొంగవేషాలన్నీ నాకు తెలేవా యేం; నిన్న పొద్దున్నుంచీ నాకు కనిపించకుండా వెళ్లావు. ఇప్పుడు మాయింటికొచ్చానంటావా. చాల్లే నీ సహవాసం. పో.

కృ :-రాధా. రాధా. నామాట వినవే (గడ్డం పట్టుకుంటాడు) నిజంగా మీా యింటికి వచ్చాను. చేతిలో చెయి వేసిచెస్తా కావాలంటే.

రా :-(కోపంతో) చేతిలో చెయ్యి ఎవరికెక్కావాలి?

కృ :-మరేంకావాలి?

రా :-(కొంటెగా చూస్తూ) వెన్నముద్దలు!

కృ :-ఓస్. బలేదానివే రాధా (నవ్వుతాడు) నిజంగా కావాలా?

రా :-పో, నాకేం అక్కర్లేదుపో.

కృ :-రాధా, రాధా, కోప్పడవద్దే నీకు వెన్న తెచ్చిస్తాలే. ఏం? సరేనా, ఇదుగో చూడు ...... ఒక్క నవ్వు నవ్వురాధా! (ఇద్దరు పక్కున నవ్వుతారు.)

(కృష్ణుడు వేణువూదుతాడు. ఎవడో వచ్చి వెన్నముద్దల పళ్లెం రాధకిచ్చి చప్పున వెళ్తాడు.)

అవిగో నే కావలసిన వెన్నముద్దలు. నీ యిష్టం వచ్చినట్లు తిను. ఇవి చాలునా. యింకా కావాలా...పాపం...తినడంచేత



శించి రాధను చూచి పకాలున విరగబడి నవ్వుతారు.)

మధు :-రాధా ! ఏమి టేమూతి కంతా పూసుకున్నావు.

వాసు :- వెన్న తింటూందిరా.

దా :_ బాగానే తింటూన్నాదే. కాదూ. నేను పెడతారా. (వెన్న తీసి రాధ మూతినిండా పూస్తూ నోట్లో పెడ్తూంటాడు.)

రా :-అబ్బ! ఉండరా. అన్నీ ఒకేసారి నోట్లో తురుగుతావేం?

(దూరాన్నుండి పిల్లల కేకలు, నవ్వులు, మాటలు వినిపిస్తాయి.) ఎవరో వస్తున్నారు. విన్నావా? ఎవరు? మన వాళ్లేనా?

కృ :-(కండ్లకు చెయ్యి అడ్డంపెట్టుకొని చూస్తూ) అవునే రాధా. అదుగో మధుసూధన్, వాసుదేవుడు వాళ్లు వస్తున్నారు.

(నలుగురు స్నేహితులు ప్రవే

ఎంత ఆత్రంరా దీనికి.

విక్ర :-దీనిదగ్గర నేర్చుకోవాలిరా వెన్నతినడం.

మధు :-ఎంత వెన్న తిన్నావేమిటే రాధా?

దా :-వెయ్యి ముద్దలురా.

(రాధ వెన్నముద్ద తీసుకొని దామోదరుడి మొహాన కొడుతుంది, వాడిమొహం అంతా తెల్లగా అయ్యేసరికి వాణ్ణిచూచి అందరు నవ్వుతారు.)

విక్ర :-అబ్బ బలే కొట్టిందిరా వెన్నముద్దతో. రాధా బలే కొట్టావే. మళ్లీ కొట్టు.

రా :-రా కొడ్తారా. (అంటూ

విక్రమ్ మీద యింకో ముద్దతో కొడుతుంది.) మళ్లీ నవ్వులు.

కృ :-(తన పైపంచతో రాధ మూతిని తుడుస్తూ) ఒరేయ్, నేనొక మంచిమాట చెప్తాను వింటారా?

విక్ర :-మళ్లీ ఎవరింటికైనా కన్నం వేయాలా ఏమిటి?

దా-కృష్ణా మా పక్కయింట్లో ఎప్పుడూ వెన్న, మీగడ పెరుగు, కుండల్లో నిండా వుంటాయిరా. ఆ యింటి మీదికింకా పోలేదు మనం. దారులన్నీ నాకు బాగా తెలుసు. ఈసారి ఆయింటికేస్తాం. ఎన్నాళ్లనుంచో ఆశ గావుందిదా.

కృ :- నీ మొహం. నీ కెప్పుడూ తిండే. (దామోదరుడి పొట్టను తట్టుతూ) ఎంతతిన్నా వీడి పొట్టనిండదు. ఇంకోసారి వేస్తాంలే ఆ యింటిమీద కన్ను...అది కాదుకాని రేపు సాయంకాలం ఆవులను దూడలను యిండ్లకు తోలి చీకటి పడగానే మనమంతా యమునాతీరానికి రావాలి. మంచి వెన్నెలుంటుందిగా. ఇక్కడే నది ఒడ్డునే మనం విందు చేస్తాం. మీయిండ్లలో అప్పచ్చులేమైనా చేసివుంటే అన్నివెదికి గుట్టు చప్పుడు లేకుండా యిక్కడికి చేర్చండి. నేను, దామోదరుడు వెళ్లి వెన్న జున్ను పెరుగు పట్టుకొస్తాం.

మ :-బలే బాగుందిరా. మా అక్కయ్య పెళ్లికి లడ్డు అవిచేసి వంటయింట్లో అటిక మీద బానలో దాచిపెట్టారు. నేనెప్పుడో దానిమీద కన్ను వేసే వుంచాలే. రేపు వాటి దుంప తెంచేస్తా. ఆఁ తర్వాత.

కృ :-తర్వాత యిసుక తిన్నెల మీద ఆటలాడి నదిలో స్నానాలు చేసి, పడవ ఎక్కి యమునలో అలా వెళ్దాం కాసేపు. ఆటలు, పాటలు, బలే చేస్తాం. సరేనా.

అందరు :-ఓ, తప్పకుండా.

రా :-ఒరేయ్ కృష్ణా. నేను రావద్దురా?

కృ :-నీవు లేకుండానా. తప్పకుండా. రేపు సాయంకాలం. అందరూజ్ఞాపకంవుంచుకోండి.

గౌరి :-(దూరాన్నుంచి) రాధా, రాధా, ఒసేవ్ రాధా!

రాధ :-కృష్ణా, కృష్ణా. మా అమ్మ వస్తూందిరా. నన్ను తంతుందేమో. ఏం చెయ్యాలి.

కృ :-ఒరేయ్, మనమంతా పరుగెత్తిపోదాం రండి. రాధా, నీవు అటువెళ్లు. మేం కనిపించంలే మీ అమ్మకు.

(చెరోకవైపుకు వెళ్తారు)

II

(రాధ యింట్లో పెద్దగది. కూనిరాగాలు తీస్తూ అవి యివి సర్దుతూంటుంది. మధ్య మధ్య చెంబులు లోటాలు క్రింద పెట్టినశబ్దం వినిపిస్తూంటుంది.)

రాధ :-ఏ పావడా కట్టుకోవాలి?...నాకేమీ దిక్కు తోచడంలేదు. (మూలుండే పెట్టెతీసి) ఈ పెట్టెలో గుడ్డలన్నీ వెదకాలి...ఈ పూల పావడా బాగుంటుంది. ప్చ! చాయపోయింది...ఇది. ఆఁ బలే బాగుంది. అసలు కనకాంబరం రంగు చాలాబాగుంటుంది. ఒకనాడు నేనీ పావడా కట్టుకుంటే కృష్ణుడు చూచి చాలా బాగుందన్నాడు. ఇది సరే...మరి పమిట... (అన్ని గుడ్డలు తీసి బైట వేసి) ఈ నీలిరంగు చాలా బాగుంటుంది. వీటిమీద తెల్ల రవికె బాగుంటుంది.



గౌ :- (ప్రవేశించి) ఒసేయ్ రాధా ఏమిటే యీరచ్చంతా. కుప్పలు కుప్పలుగా ఆగుడ్డలెందుకే అట్లా వేశావు? అయ్యయ్యో! ఎక్కడిపిల్లరా యిది భగవంతుడా. నీకేం తిన్నది కాస్తా అరగడంలేదా ఏం? అయినా యీ చీకటి వేళ

ప్పుకు వాటితో ఏంపనే నీకు.

రా :- ఏమీలేదే. నా గుడ్డలన్నీ సర్దుకుంటున్నా.

గా :-ఏడ్చావు. రా. వేళా పాళా లేకుండా వెధవపనులు నీవు. నీవు బట్టలు చేసేవాళ్లు లేక మరీ ఆడిపోతున్నావు యిష్ట మొచ్చినట్లల్లా. పడుకో.

రా :-నాకు నిద్రరాలేదే.

గా :-ఏం, ఎందుకని?

రా :-మధ్యాన్నం బాగా నిద్ర పొయ్యాను.

గా :-అయితే రాత్రంతా ఆ పెట్టెలు సవరిస్తూ కూర్చుంటావా? నడుం విరగ్గొట్టేస్తాను పోయిపడుకో.

(రాధ పడుకుంటుంది) కొద్ది సేపటికే గౌతమి గురకలు తీస్తుంది.)

రా:-ఆఁ యిదే సమయం. గుడ్డలు కట్టుకుంటా. (అని ఏరుకున్న గుడ్డలన్నీ తీసుకొని వెళ్లుతుంది. లోపల చెంబులు లోటాలు, పళ్లెం అన్నీ కింద దొర్లి పెద్ద శబ్దాలౌతాయి.)

గా :-(మంచంలోనుంచే నిద్ర మత్తుగా) రాధా!

రా :-(లోపలినుంచే) ఆఁ

గా :-ఎక్కడ? ఏంచేస్తున్నావ్ ఆచీకట్లో.

రా :-దాహమైతే మంచినీళ్లు వెదుకుతున్నా.

గా :-కనపడ్డాయా?

రా :-లేదే.

గా :-మరిచిపొయ్యా. ఇదుగో నా మంచంకిందనే వుంది మంచినీళ్ల చెంబు. తాగిపడుకో చాలా పొద్దుపోయింది.

రా :-(కొత్త గుడ్డలతో అలంకరించుకొని వస్తుంది.)

గా :-(రాధనుచూచి) ఇవ్వాళ నీకేమో పిచ్చెత్తినట్లుందే. ఇప్పుడు కట్టుకున్నావేమిటే ఆ పావడా అవి...ఎక్కడికైనా ప్రయాణమా? చెప్పు. చెప్పవే. (లేచి కూర్చుంటుంది.)

రా :-(తలవంచుకొని పెదవిని చూపుడు వేలితో నొక్కిపట్టి కాలి బొటన వేలితో నేలనురాస్తూ నిల్చుంటుంది.)

గా :-చెప్పవేం?

రా :-కృష్ణు......

గా :-దేనికి...ఈ దిక్కుమాలిన వాడు బాగా దాపురించాడు. మాదుంప తెంచుతున్నాడు. అయితే యివ్వాళప్పుడు

దేనికి? ఆడపిల్లవు. సిగ్గు శరంలేదూ? పొద్దున లేస్తే మొగ వెధవలతో ఎగరడం. పోయి పడుకో! యిల్లుకదిలా వంటే వీపు బద్దలౌతుంది. రేపు మీ నాన్నరానీ ఆయనతో చెప్పి ఏంచేయిస్తానో చూడు.

రాధ వెక్కి వెక్కి ఏడుస్తూ దుప్పటి కప్పుకొని పడుకుంటుంది.)

III.

[యమునా తీరం. చల్లనిగాలి వీస్తూంటుంది. ఒకడు నక్కలాగా, మరొకడు, కుక్కలాగా, యింకొకడు పిల్లిలాగా కూస్తూంటారు. మిగిలినవాళ్లందరు నవ్వుతారు విరగబడి.)

మ:-వెన్నెల చాలా బాగుందిరా.

కృ:-సరేగాని పులుసన్నం పెరుగన్నం, పండ్లు, మిఠాయి అన్ని తీసుకొచ్చారా.

మ:- అన్నీ వచ్చాయి.

దా:-కృష్ణా. బలే ఆకలౌతూందిరా. ఇంకా ఎప్పుడు తినేది, ముందునాకు పెట్టమనరా.

కృ:-నోరుముయ్. వెధవా ఎప్పుడు తిండి, తిండి.

వా:-ఒరే కృష్ణా! ఈ దామోదరు డేంచేశాడో తెలుసా? పులుసన్నం మీద మూతతీసి చాలాసేపు వాసన చూశాడు.

వి:-ఒరేయ్, నీ వేంచేశావురా? కృష్ణా వీడు పెరుగన్నం కాస్త తీసుకొని గుట్టుగా తిన్నాడు.

దా:-ఈ విక్రముడు, ఆయిదారు వెన్నముద్దలు మింగాడురా.

కృ:-మధూ! నీవు అన్నీ జాగ్రత్తగా పెట్టరా. ఎవరైనా వాటిని ముట్టుకున్నాడంటే యమునలో పామును బైటికి తీసుకొస్తా, తెలుసా.

అందరు:-ఓరి బాబో, కాళీయుడా? వద్దు వద్దు కృష్ణా. మేం ముట్టుకోనే ముట్టుకోం.

కృ:-సరే సరే వెళ్లి ఆడుకోండి. (వెళ్లుతారు.) మధూ! రాధ యింకా రాలేదే.

మ:-వాళ్లమ్మ పెద్ద బ్రహ్మరాక్షసిరా! రాధను రానిస్తుందా?

కృ:-పాపం, యింతమంది వున్నా రాధ లేకపోతే ఏమీ బాగాలేదురా. ఎంత ఏడుస్తూందో రాధ.

మ:-అవును పాపం. ఆముసిలి దాన్ని కట్టేసి యీడ్చుకొచ్చి యమునలో ముంచితే

# పేర్ల కథలు

కీర్రా ......శాస్త్రి

పూర్వకాలంలో మగధ అనే దేశం ఉండేది. ఆ దేశాన్ని బృహద్రథుడనే రాజు పరిపాలించేవాడు. అతనికి మూడు అక్షౌహిణీల సైన్యం ఉంది. ఒక అక్షౌహిణీ అంటే ఎంతో తెలుసా? 21870 రథాలు, అన్నే ఏనుగులు, 65610 గుర్రాలు. 109350 మంది వీర భటులు, ఇవన్నీ కలిపి ఒక అక్షౌహిణిఅని పూర్వంఅనేవారు. అంత సైన్యం ఉంది కనుక చాలా దేశాల్ని జయించి రాజ్యం పెద్దది చేసుకున్నాడు. అతని బలం, గొప్పతనం అన్నీ చూసి, కాశీరాజు తన ఇద్దరు కూతుళ్లని అతనికిచ్చి పెళ్లి చేసాడు. పెద్ద దాని పేరు అతికాంతి, రెండవదాని పేరు మతి. ఆ ఇద్దర్నీ పెళ్లాడి డబ్బుకు లోటులేదు కనుక అన్ని విధాలైన సుఖాలూ అనుభవిస్తున్నాడు బృహద్రథుడు. మొదట్లో ఏ విచారమూ లేకపోయినా కొంతకాలమయ్యేసరికి ఒక పెద్ద విచారం కలిగింది. ఏమిటది? అన్నీ ఉన్నాయికాని, పిల్లలు లేరు. సంతానంకోసం ఎన్నో నోములు నోచారు. ఎన్నో వ్రతాలు చేసారు. కాని లాభం లేకపోయింది. చాలాకాలం చూసారు. ఇంక లాభంలేదనుకుని పుత్రులు లేకపోతే పెద్ద నరకం వస్తుదని పెద్దలు చెప్తారు కనుక అడవుల్లోకి వెళ్లి ఏ భగవంతుని గూర్చయినా తపస్సు చేస్తే సంతానం కలుగుతుందేమో అని ఇద్దరు పెళ్ళాలూ తనూ అడవికి బయలుదేరారు. వెళ్లి వెళ్లి ఒక అడవి చేరుకున్నారు.

ఆ అడవిలో తపస్సు చేసుకునే మునీశ్వరు లెవరయినా ఉన్నారేమో అని అంతా తిరి

బాగుండురా.

కృ :-పోనీ మనంవెళ్లి రాధను తీసుకొద్దామా,

మ :-లాభంలేదు కృష్ణా. ఇంట్లో ఏదోమూల గదిలో పడుకుంటుందిరా అది. దానిపక్కనే వాళ్లమ్మ భూతంలాగా పడుకుంటుంది. మనం అక్కడికి పోలేమురా. దానిచేతిలో పడ్డామంటే మనవంటినిండా వాతలు పెడుతుంది.

కృ :-అయినా వెళ్లి చూస్తాం చేతనైతే సరే; లేకపోతే వెనక్కి తిరిగి వచ్చేస్తాంలే.

మ :-సరే పోదాం పద.

కృ :-వాళ్లతో చెప్పేసి పోదాం.

(ఇద్దరు వెళ్తారు.)

[వచ్చే నెల ఈ నాటకం ఇంకావుంది.]


ENAMEL BOARDS
means
better display
&
better business
PERMANENT
CHARMING
MADRAS ENAMEL WORKS LTD.
65 SYDENHAMS ROAD .... MADRAS



స్వర్ణోత్సవ వికాసము
నర్తనశోభ




పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతము

ఆ యిరువురూ ఆరోగ్యమూర్తులు. నిశ్చింతగా మధురమయ నర్తనలో హాయిగా కాలము గడుపుతారు. అదంట నాట్యమాడుటేగాదు, పరిసరములలో నిత్య వసంతోత్సవ శోభ వెల్లి విరిసేలా చేస్తారు. అర్ధ శతాబ్దముగా ప్రసిద్ధ బలవర్ధక రసాయనముగా పేరొందిన "జీవామృతము" మీలోనూ ఆ ఉత్సాహ బలానందములు ప్రజ్వరిల్లేలా అవశ్యం చేయగలదు.



ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్
(స్థాపితము 1898)
మద్రాసు. 17

గారు. ఒకచోట ఒక మామిడి చెట్టుంది. ఆ చెట్టునిండా పచ్చటి పళ్లున్నాయి. ఆ మామిడిచెట్టు మొదట ఒకచిన్న అరుగు ఉంది. ఒకముని ఆ అరుగు మీద కూర్చుని తపస్సు చేసుకుంటున్నాడు. అతడు కళ్లు మూసుకునే ఉన్నాడు. అతని తేజస్సు సూర్య తేజస్సులాగ ఉంది. అతని పేరు చందకౌశికుడు. రాజూ రాజు పెళ్ళాలూ అతన్ని భక్తితో సేవించటం ప్రారంభించారు. రోజూ ప్రొద్దున్నే స్నానాలు చేసి పాలు తెచ్చి అతని పాదములదగ్గర పూజచేస్తూ అక్కడే భగవంతుణ్ణి ధ్యానిస్తూ కూర్చునేవారు.

ఇల్లాగ కొన్ని నెలలయ్యేసరికి ఆముని ఒకమారు కళ్లు తెరచి చూచాడు. ఎదురుగుండా వాళ్లు కనుపించారు. ఆ ముని దివ్య దృష్టివలన వాళ్ల సంగతంతా తెలుసుకున్నాడు. రాజా! నీభక్తికి మెచ్చాను. ఇదిగో ఈ పండువల్ల నీకొక కొడుకు పుడుతాడు. అని చెట్టుమీదకి చూసేసరికి ఒక పండు దభీమని చేతులో పడింది. ఆశ్చర్యంతో ఆపండు తీసుకుని రాజూ పెళ్ళాలూ సంతోషంతో ఇంటికి వచ్చేసారు. ఇంటికి వచ్చాక సంతోషంతో రాజు ఆ పండుని పెళ్ళాలిద్దర్కీ చెరిసగం తినమన్నాడు. వాళ్లు అల్లాగే తిన్నారు. కొన్నాళ్లకి



ఇద్దరూ కడుపుతో ఉన్నారు.

కొడుకులు పుడతారని భలే సంతోషంతో ఉన్నాడు రాజు.

ఇద్దరినీ చెరొక అంతఃపురం లోనూ ఉంచి జాగ్రత్తగా చూడటంకోసం చాలామంది దాసీల నుంచాడు. తొమ్మిది నెలలూ నిండాయి. ఒకరోజున ఇద్దరు భార్యలకీ ఒకే సమయంలో పురుడు వచ్చింది. అయితే అ పుట్టిన పిల్లలిద్దరూ చాలా విచిత్రంగా ఉన్నారు. ఒక కన్నూ, ఒక కాలూ, ఒక చెయ్యి. ఇల్లాగ ఒక్కొక్క భాగం మాత్రమే ఉంది. ఒక పిల్లవాణ్ణి మధ్యకి చీలిస్తే ఆ రెండు ముక్కలూ ఎల్లా గుంటాయో అల్లాగున్నారు ఆ యిద్దరూను. ఆ రాణులూ దాసీలూ చాలా విచారించారు. ఒక కొడుకు పుడతాడని ముని ఇచ్చిన పండుని ఆమాట మరిచిపోయి ఇద్దరమూ తిన్నాము. అల్లాగే ఇద్దరికి చెరి సగం పిల్లాడు పుట్టాడు. కొడుకులు



పుడతారని సంబరంతో పొంగిపోతున్న రాజుకి ఈ ముక్కల్ని చూపిస్తే ఎంత ఏడుస్తాడో! కనుక చూపించవద్దు. అనుకుని ఆరాణులిద్దరూ దాసీలను పిలచి ఈ సగం సగం ముక్కల్ని వెంటనే కోటఅవతల పారవేసి రమ్మన్నారు. దాసీలు రహస్యంగా కోట గోడమీదనుండి ఆరెండు ముక్కల్ని అవతలకి విసిరేసారు.

అక్కడ రాజుగారు పురుడు వచ్చే సమయంకదా, ఏం పిల్లలు పుడతారో! ఇద్దరూ మగపిల్లలయితే బాగుండును. అనుకుంటూన్నాడు. ఇంతట్లోకే వీధిలోంచి 20 ఏళ్ల ఒక ఆడపిల్ల పెద్ద పనసపండంత పిల్లాణ్ణి మొయ్యలేక మొయ్యలేక తీసుకువచ్చింది. ఆపిల్లాడు గుప్పిడినోట్లో పెట్టుకుని ఇల్లెగిరి పోయేటట్లు ఏడిచేస్తున్నాడు. ఆమె తిన్నగా రాజుదగ్గరకువచ్చి "రాజా! ఇదిగో నీ పిల్లాడు. రా! రాణులదగ్గరకు వెడదాం!" అంది. రాజు ఆశ్చర్యంతో సంతోషంతో ఏమిటో ఏమీ తెలియకుండానే రాణులున్న అంతఃపురానికి ఆమెతో వెళ్ళాడు. అక్కడ వాళ్లు ఏడుస్తున్నారు. పిల్లాడి ఏడుపు విని అంతా ఆశ్చర్యపడి వీళ్లకేసి చూసారు, అప్పుడు ఆపిల్లవాణ్ణి ఎత్తుకున్న ఆమె ఇల్లా చెప్పింది.

రాజా! నాపేరు జర. నేనొక రాక్షసిని. రోజూ రాత్రిళ్లు ఆహారంకోసం వీధుల్లో తిరుగుతూంటాను. ఇవ్వాళ అల్లా తిరుగుతూంటే కోట వెనక ప్రక్కన ఏమిటో రెండు మాంసపు ముద్దల్లాగ కనుపించాయి. వెంటనే ఆ రెండింటినీ ఏరి కలిపి పట్టుకున్నాను. కలిపీ కలపటంతోటే, ఇదిగో ఈపిల్లాడయి, ఇల్లా ఏడవటం ప్రారంభించాడు. ఏమిట్రా ఈ విచిత్రమని అంతా ఆలోచించాను. అంతా నాకు తెలిసిపోయింది. ముని నీకు పండిచ్చినప్పుడు ఒక్కడే కొడుకు పుడతాడని చెప్పాడుకదా! ఆపండు నీయిద్దరు భార్యలు సమానంగా తినటంవలన ఆ పుట్టే ఒక్క కొడుకూ రెండు ముక్కలుగా పుట్టాడు. ఆముక్కలు నీకు చూపి చలేక నీభార్యలు కోట వెలుపల పారేశారు.


అయినా మునీశ్వరుని మంత్ర

ప్రభావం వల్ల నేను కలపగానే మామూలు పిల్లాడై పోయాడు. అందుచేత వాడు నీకొడుకు. నేను చాలాకాలనుంచి మీ కుటుంబానికి ఏదయినా ఉపకారం చెయ్యాలనుకుంటున్నాను. ఇందా! తీసుకో! అని ఆపిల్లాణ్ణి రాజుకిచ్చింది. రాణులువచ్చి తీసుకున్నారు. అందరూ బలే ఆశ్చర్యంతో ఆనందంతో చూస్తున్నారు. అప్పుడు రాజు, అమ్మా! నువ్వు రాక్షసివయితే అయ్యావు కాని, నాకు మహోపకారం చేసావు. నీపేరు జర అన్నావు కనుక, నువ్వు సంధించటం (అంటే రెండింటిని ఒకటిగా కలపటం) మూలాన్న ఈ పిల్లాడు బ్రతికాడు కనుక వీనిపేరు జరాసంధుడు అని పెడుతున్నాను. అని సంతోషంతో నమస్కరించాడు. ఆరాక్షసి మాయమయిపోయింది. అంతా ఆనందంతో ఉన్నారు. ఈ జరాసంధుడే భారతంలో భీముడిచేత రెండు చీలికలుగా చీల్చబడి క్రింద పారేసేసరికి మళ్లీ మామూలుగా కలిసి పోతూండేవాడు. అప్పుడు రహస్యం తెలుసుకుని భీముడు జరాసంధుణ్ణి రెండుగా చీల్చి ఇవతలిముక్క అవతలికి అవతలి ముక్క ఇవతలకీ పారేసేసరికి మళ్లీ కలియకుండా పోయాడు.


## మేకప్ లో పోలికలు




అల్లావుద్దీన్ — లాంతరు



పి. నారాయణమ్మ (అనకాపల్లి)



ఎస్. శాంతకుమారి (కంచల)



పి. నారాయణమ్మ (అనకాపల్లి)

# "ఫ్రెంచిలీవు" కథ

రచన : కె. వి. రామన్ బి. ఏ.

హాలా !

ఫ్రెంచి లీవంటే ఏమిటి? అదెల్లా అలవాటులోకొచ్చింది? అదికదూ నీకు సందేహామొస్తే? సరే. విను.

"ప్రెజెంటు" అంటే హాజరు కావడం. "ఆబ్సెంటు" అంటే హాజరుకాక పోవడం. "లీవు" అంటే అనుమతిపొంది హాజరు కాకపోవడం. ఈమూడు మాటలూ బడుల్లో సాధారణంగా వాడుతోంటారు. ఇంక "ఫ్రెంచి లీవు" అంటే అర్థం. హాజర్రై ఎవరి అనుమతి లేకుండా వెళ్ళి పోవడం.

ఈ ఫ్రెంచి లీవు అన్నమాట అలవాటులోకి రావడాన్ని గురించి రెండు రకాలకథలు చెబుతున్నావిను.

ఫ్రాన్సు అనే ఒక దేశం ఉంది. అందులో వుండే ప్రజల్ని ఫ్రెంచివారంటారు. ఆదేశాన్ని పాలించేందుకు మంత్రులు, ఆ మంత్రులు సరిగా పనిచేసేట్టుగా చూడ్డానికొక శాసనసభ వున్నాయి. మన దేశంలో లాగే! అక్కడి శాసనసభలో పదిపన్నెండు పార్టీలున్నాయి. మన రాష్ట్రంలో ఏడాదికొకసారి మంత్రివర్గం మారితే వింతగా చూస్తామా! అక్కడ మాత్రం నెలకొక మంత్రివర్గం మారుతూంటుంది. పేపరుచదివే బాలలకీ విషయం తెలిసేవుంటుంది. అందువల్ల ప్రభుత్వమంతా అయోమయంగా వుంటుంది. శాసన సభ్యులకి వారిపని చాలావిసుగుగా ఉంటుంది. ఒకవేళ శాసనసభ సమావేశానికి హాజరుకాకపోతే వాళ్ళకొచ్చే బత్తెవు డబ్బులు (ఎలవెన్సులు) రావు. అందువల్ల వాళ్ళు హాజర్రై విసుగెత్తినప్పుడు, మనశాసన సభ్యుల్లా కునుకుపాట్లు పడుతోనో, పక్కవాళ్ళతో మాట్లాడుతోనో, కూచోక, ఎవరితో చెప్పకుండానే (సభాధ్యక్షుని అనుమతి లేకుండానే) వెళ్ళిపోతారు. అల్లా వెళ్ళిపోవడం

వాళ్ళకి లీవుక్రింద చలామణీ ఇవుతోంది. ఈరకం లీవు ఫ్రెంచి వాళ్ళలో ఉంది కాబట్టి ఫ్రెంచి )వు అనే పేరువచ్చింది.

ఇంక రెండో కధ. ఈరకంగా గైజరై, అనుమతి లేకుండా వెళ్ళి గోవడం ప్రతి దేశంలోనూ ఉన్న )షయమేకాని, ఇంగ్లీషువాళ్ళకి ఫ్రెంచివాళ్ళమీద కోపం చేత, ఈరకపు లీవుని ఫ్రెంచి లీవని లుస్తారు. చూడూ! మనం వెట్టిచాకిరిని అరవచాకిరి అనీ, ఖచ్చితంగా డబ్బుకి నిలవేసే వాడ్ని కాబూలీ వాడని, టోపీ వేసేవాడ్ని గుజరాతీ టోపీ దారని, (మార్వాడీ) పిలుస్తాం. అల్లాగన్నమాట. ఇంగ్లండులో ఈమాట బాగా ప్రచారంలో వుంది. ఇంగ్లీషువాళ్ళీమాటని మన కలవాటు చేశారు. వాళ్ళు మన్నువిడిచి వెళ్ళిపోయినా వాళ్ళు నేర్పిన ఈమాట మాత్రం మనం వదల్లేదు.

---


## * చలికాలము: దోమలు *

చలికాలంలో కిటికీలు తలుపులు తెరచుకొని పడుకుంటే చలివేస్తుంది. అంటే తలుపులన్నీ మూసి పడుకుంటాము. అప్పుడు దోమలు బాగా పడకగదిలో చేరి కుట్టటం సాగిస్తాయి. పక్కలమీద మంచి కర్పూరపుపొడి చల్లితే, దోమలు ఆ పక్కలకు రావు.

మంచి కర్పూరంఅంటే 'గడియారంమార్కు' కర్పూరం 'గడియారం మార్కు' కర్పూరం అన్ని షాపుల లోను దొరుకుతుంది. లేదా, యీ క్రింది అడ్రసుకు వ్రాయండి.

గోపాల్‌జీ చాంపషీ అండ్ కో.,

30, గోవిందప్పనాయక్ వీధి, * జి. టి. మదరాసు 1.

# పొంగలి సెలవుల పరీక్ష

తరగతులు అన్ని] [కాలము ¼ గం॥

షరా: ప్రతి ప్రశ్నకు 10 పేజీలకు తక్కువ కాకుండ జవాబులు క్లుప్తముగా వుండవలెను. దస్తూరీ లొట్టిపిట్ట ఆకారములో ముత్యములవలె వుండవలెను.

మార్కులు

1. ఈక్రింది పద్యపాదములలోని తాత్పర్యమును వ్రాయుము:
   (అ) చలి, చీమలచేతజిక్కి చావదె సుమతీ!
   (ఆ) పురుషులందు పుణ్యాపు ఋషులు వేరయా!
   (ఇ) అప్పిచ్చువాడు వైద్యుడు! ... 6
2. విమానముకంటె తొట్టిపడవ అతివేగముగా పోవునని నీవెట్లు ధృడపర్చగలవు? ... ... 5
3. రైలులో టిక్కెట్టు కొనకుండ ప్రయాణముచేయు సూత్రమెద్ది? ... ... ... 5
4. ఇడ్లీకి రుచి సాంబారా? లేక చెట్నీయా? అవిపులముగా వ్రాయునది. ... ... 5
5. గుణసుందరి సినీమా చూచితివా? అట్లయిన నీవా డబ్బులను ఎచ్చట సంగ్రహించితివో సంగ్రహముగా వ్రాయుము ... ... ... 5
6. మీ బడిలో అందరి మేష్టార్లకన్నా మీలెక్కల మేష్టారంటే నీకు బహుప్రీతి. కారణము తెలియజేయుము. ... ... ... 5
7. ఈమధ్య మీ గ్రామములో ఆడించిన తోలుబొమ్మలాట వలన కలిగిన ముదమెంత? ఖర్చయిన ఆముదమెంత? ... ... ... 4
8. ఈక్రింది పదములు కుడినుండి యెడమకు మార్చి సంధి సూత్రము వ్రాయుము:

1. జాబగుబా ; 2. కత్రిపలబా ; 3. కపకప ; 4. ప్పాపడిజీ
5. కలపిట్టుజు ... ... ... 5

. ఈక్రింది మాటలు ఎవరు ఎవరితో ఏ సందర్భము పల్కారి ?

1. "మున్నిరుడు పొరపాటు ; నిరుడు గ్రహపాటు; ఈయే
అలవాటు"

2. "ఆ తప్పు నేనుచేసింది కాదుసార్. మా అన్న చేశాడు

3. "నాధా ! మీవ్యాసము పత్రికలో పడలేదేమీ ? కవ
ఖర్చుచేసిన బేడకు సేరు ఉప్పువచ్చునే!"

0. ఈ క్రిందివానిలో ఏవో రెంటిని గూర్చి 1000 పంక్త
వ్రాయుము : (అ) గ్రామసింహము ; (ఇ) కిష్కింద
పురీ అగ్రహారీకుడు ... ... 5

కూర్పు : మైలవరపు సత్యనారాయణ (సామర్లకోట)

---


పిల్లలబాధలు ♦ ♦ ♦

♦ ♦ పెద్దలతలనొప్పులు

గజ్జి, కురుపులు, దురదలు, దెబ్బలు, గోకుడుపుండ్లు, చీముపుండ్లు, కాలినపుండ్లు మొదలగు చర్మవ్యాధులను పోగొట్టి విషక్రిములను చంపి బాధలను తొలగించుదివ్యమైన మందు.

# శ్రీవత్సావారి స్కిన్ రెమెడీ

వివరములకు :

## శ్రీవత్స కెమికల్సు & డ్రగ్సు లిమిటెడ్

(మందులను తయారుచేయు సంస్థ)

72, గోవిందప్పనాయక వీధి. మదరాసు 1.

# భసాపంకం

రచన : భోగరాజు సూర్యప్రకాశరావు (ఉరట్ల)

ఒక ఊళ్లో ముగ్గురు అన్నదమ్ము లున్నారు. పాపం, వాళ్లు చాలా బీదవాళ్లు. అందుచే జీవనోపాధి సంపాదించడానికి దారి తెలియక బాధపడుతున్నారు. ఇలావుండగా ఒక రోజు ఆవూళ్లో ఒకాయన, వెళ్లి రాజదర్శనం చేస్తే రాజుగారేమైనా ఇస్తారని సలహా నిచ్చాడు. అందుచే ముగ్గురన్నదమ్ములు రాజదర్శనానికి బయలుదేరారు.

రాజధాని చేరి రాజసభలో రాజుగార్ని దర్శించడానికి పోతే బాగుండదని ఒక టెంకాయ నొకదానిని రాజుగారికి సమర్పించడానికి తీసుకు వెళ్లారు.

రాజుగారిని, ఆసభను చూడడంతోనే ముగ్గురన్నదమ్ములకు భయం పట్టుకుంది. కాని భయపడి వెనక్కుపోతే తమ భక్తి కెల్లా! అందుచే సాహసించి ముగ్గురూ ఒకరి వెనకాల ఒకరు రాజుగారిదగ్గరకు సమీపించారు. ముందు నున్నవాడు చేతిలో టెంకాయను రాజుగారి కందించి "టెంకాయ పిచ్చికొండ" అని కాళ్లు వణకుతూఅన్నాడు. రెండవ వాడుతన అన్నగారు 'టెంకాయి పుచ్చుకోండి' అనడాన్కి బదులు అలాగ అన్నాడని అతని పొరపాటు సభాకంపంవల్ల కలిగినదని అనబోయి రాజుగారి నుద్దేశించి "మావాడికి కొంచెం భసాఫంకం వుంది. క్షమించండి" అని తడబడుతూ అన్నాడు.

సభ అంతా వారి తొట్రుబాటుకు పక్కున నవ్వారు.

ఇంక మూడోవాడు వాళ్లిద్దరు తెలివితక్కువ వాళ్లని తనే పెద్ద తెలివైన వాడినని నిరూపించబోయి "అయ్యా! దొందుకు దొందూ అంతే" అని ముద్దగా అన్నాడు.

రాజుతో సహా సభ అంతా విరగబడి నవ్వడం ప్రారంభిం



చారు. రాజుగారు వాళ్లేదో కోరికతో తమ దర్శనానికివచ్చి తమ కందరికీ హాస్యాస్పదులైనారని విచారించి చెరో వరహానిచ్చి సాగనంపారు.

బాలా! చూశావా, సభల్లోమాట్లాడడం ఎంతకష్టమో. ఎలాంటి వారైనా తబ్బిబ్బవుతారు. అందుచేత పెద్దయితే నువ్వు చాల సభల్లోను, కాలేజీ డిబేట్లలోను మాట్లాడవలసి వుంటుంది కాబట్టి చిన్నప్పటినుండీ నలుగురిలోను భయం లేకుండ మాట్లాడడం అలవాటు చేసుకో


## చమత్కార గణితము

మంచి జ్ఞానమును, మనోబలమును, తెలివిని అభివృద్ధిచేయునంతటి రసవంతములైన చిత్రవిచిత్రలెక్కలు, వినోద మనోగణితములు, సమస్యలు, చిక్కుప్రశ్నలు, యుక్తిలెక్కలు, తమాషా లెక్కలు, యిందులోనున్నవి. ఈ గ్రంథమును చదివినబుద్ధిబలమును, తెలివియు కలుగును. నీవద్ద తప్పక నుండవలసిన పుస్తకము. దీని వెల రూ. 2-8-0.

రిజిష్టర్డు పోష్టుచార్జి అ 6 లు.

☞ వీ. పి. పద్ధతిలేదు - డబ్బుముందు పంపండి.

పి. ఆర్. జనార్ధననాయుడు(B), చిలకలూరిపేట పోష్టు, (గుంటూరుజిల్లా).

# ప్రశ్నలూ — జవాబులూ

ప్ర :-బడిలో చదువుకున్న పిల్లలు రాజకీయ రంగంలోకి దిగ వచ్చునా?

—యం. వీరభద్రరావు (పెదబ్రహ్మదేవం)

జ :-రాజకీయ విషయాలు తెలుసుకోడం మంచిదేగాని, చదువులుమాని రంగంలోనికి దిగరాదు.

ప్ర :-అన్నయ్యా! మదరాసు చూడాలని వుంది. మీ ఇంట్లో భోజనము పెడతావా?

—తాయి యస్. సి. మౌళి (కాకినాడ)

జ :-పెడతాను. రా. ఒచ్చేటప్పుడు రేషన్ బియ్యం తెచ్చుకో!

ప్ర :-“బాల” కు ఐదు సంవత్సరములు నిండినవి కదా! బడిలో ఎప్పుడు వేయుదువు?

—గుండుమళ్ల వెంకటరెడ్డి పంతులు (శ్రీకాకుళం)

జ :-‘బాల’ కు ప్రపంచమే బడి. ఆంధ్ర దేశమనే తరగతిలో మీతో కూడా కలిసి వుంటూంది.

ప్ర :-బెజవాడ విజయవాడగా మారింది కదా! మరి మన “బెజవాడ గోపాలరెడ్డి” గారు “విజయవాడ గోపాల రెడ్డి” గా మారలేదేమి!

—నిష్ఠల ఇందిరాదేవి (చోడవరం)

జ :-బలే ప్రశ్న వేశావు. బహుశః విజయవాడ మన రాజధానికి ప్రధాన నగరం అయితే మారుస్తారేమో!

ప్ర :-పాలు, పెరుగు, మజ్జిగ ఎంత త్రాగినా విరక్తి పుట్టదు. ఎందుచేత?

—ఎ. రామకృష్ణ పరమహంస (హనుమాన్ జంక్షన్)

జ :-ఎక్కువగా ఏమిటితిన్నా మంచిది కాదు. విరక్తి కలగక మానదు.

ప్ర :-“పుష్ప” “జూనియర్” పత్రికల ఎడ్రసు తెలియ జేస్తారా?

—పి. వి. రంగారెడ్డి (ఆస్పరి)

జ :-“పుష్ప“ గునిస్తాన్, బొంబాయి; “జూనియర్” టైమ్స్ ఆఫ్ ఇండియా ఆఫీసు, బొంబాయి.

ప్ర :-ఎక్కువగా సిగరెట్లు త్రాగే వారికి బట్టతల అవుతుందని ఒక గొప్ప డాక్టరు వ్రాశాడు. ఇది ఎంతవరకు నిజం.

—వి. వీరభద్రం (కాళమనాయుడు పేట)

జ :-ఎంతవరకు నిజమైనా మనకేంగాని, నువ్వుమాత్రం సిగరెట్లు త్రాగకు.

ప్ర :-ఏమండీ! ఆడవాళ్లు నోములు నోచుకుంటారు మగవారు ఎందుకు నోచుకోరు!

—కలగ సుబ్రహ్మణ్యశాస్త్రి
(పాట్నా)

జ :-అందుకు నోచుకోలేదు గనుక. నువ్వో రెండు నోములు నోచి చూడు. ఫలితం బాగుంటే ప్రచారం చేద్దాం.

ప్ర :-సూర్యునికి తెలియని వస్తువు యేది?

—భాగీ లలితాంబ
(రాయచూరు)

జ :-చీకటిబజారులో అమ్మే వస్తువులు.

ప్ర :-ఊసరవిల్లి అనగా నేమి?

—యల్. సుధాకర్
(మద్రాసు)

జ :-తొండ ముదిరితే దాన్ని ఊసరవిల్లి అంటారు.

ప్ర :-అన్నయ్యగారూ! మిమ్ములను రాబోవు ఆంధ్ర రాష్ట్రానికి ప్రధానిగా చేశారనుకోండి! అప్పుడు మీరు పిల్లల బాగుకి పాటుపడతారా?

—పి. ఎస్. బి. కుమార్
(బొబ్బిలి)

జ :-తమ్ముడూ! అనుకోడాలు పనికి రావు. నిజంగా నేనే ప్రధానినయితే, బాలల రాజ్యం స్థాపించనూ!

ప్ర :-బాల భాగవతారిణి బేబీ ఉద్రపదష్ట సరోజినీ కుమారి ఎడ్రసు తెలియజేస్తారా?

—ఆర్. సత్యనారాయణమూర్తి
(విజయనగరం)

జ :-"సరోజిని" 70, కోదండరామస్వామి వీధి, పాత మాంబళం, మద్రాసు 17.

ప్ర :-ఆకాశంమీద చుక్కలు అప్పుడప్పుడు రాలుతుంటాయి, ఎందుచేత?

—మన్ని కన్నయ్య
(మాదరపాకం)

జ :-గ్రహముల ఆకర్షణ శక్తివలన కలిగే మార్పులలో ఈ తారుమార్లు జరుగుతూవుంటాయి.

ప్ర :-చంటిపిల్లలు వారి నీడను అద్దములో చూడకూడదంటారు. ఎందుచేత!

—వి. అప్పలనరసయ్య
(విశాఖపట్టణం)

జ :-అద్దంలో తమ ప్రతిబింబంచూచి పాపలు సంతోషం పట్టలేక చేతులతో ఆ అద్దాన్ని కొట్టబోతారు. ఆ సమయంలో అద్దంపగిలి, పాపల బుల్లిచేతులకు గాయాలు తగలవచ్చును.

# సోము కథ

గోము జడకు గాలిపటం కట్టి విడిచిన ఆతుంటరి బాలే సోము. జ్ఞాపకం వుందా?

గోము గాలిలో ఎగిరిపోవడం మూలాన సోముకి ఏమీ తోచ లేదు. గోముని తలచుకొంటూ అలా కూర్చున్నాడు. కన్నీరు కార్చాడు. ఆకాశంమీద మేఘా లుకూడా సోముతోబాటు కన్నీరు కార్చాయి!

గోముని వెతకడానికి సోము బయలుదేరి వెళ్లాడు. వెళ్లి వెళ్లి ఒక చిట్టడవిలో పడ్డాడు. సగం రాత్రి అయింది. గోముని తలచు కొంటూనిద్ర పోయాడు. నిద్రలో



ఒక మంచి కల వచ్చింది. కలలో గోము ఎంతో మంది పిల్లలతో హాయిగా ఒక పడవ మీద వెళ్తోంది. అదుగో ఆకాశం! ఆకా శంమీద చుక్క లు. ఆ చక్కని చుక్కలతో ఆడుకుందుకా వెళ్తోంది!"

గోము హా యిగా వున్నట్టు కల వచ్చింది. ఇక, సోము ఏమి చేస్తాడో?

# పాపాయికి పేరు పెట్టండి.

*

♦ ♦ ♦



బాలా!

నీకు ఒక చిట్టి చెల్లాయి పుట్టిందనుకో! ఆ చెల్లాయికి ఏమి పేరు పెడతావు? ఇదుగో ఈ బొమ్మలో ఒక తల్లి ఒక పాపాయిని ఎత్తుకుంది. ఆపాపాకి ఒక పేరు పెట్టాలి. బొమ్మను బాగా చూచి, ఆలోచించి నీకు తోచిన పేరు పెట్టు. మన చిత్రకారుడు పెట్టిన పేరు ఆఖరు పేజీలలో వుంది. చూడు.


## బంధువులు: ఆతిథ్యము

*

సంక్రాంతి పండుగకు ప్రతివారి యిల్లూ కలకలలాడుతూ వుంటుంది. ఆప్త బంధువులంతా వస్తారు. పండుగ అవగానే వెళ్లిపోతారు. ఎంతమంచి పిండివంటలు చేసిపెట్టినా ఏదో వంక ఎంచుతారు. వంటలో మంచి ఇంగువ వాడినట్లయితే తృప్తిపొందుతారు. మంచి ఇంగువ అంటే,

** 

'తిలక్ మార్కు' ఇంగువ.

తిలక్ మార్కు ఇంగువ అన్ని షాపులలోను దొరుకుతుంది.

లేదా, యీ క్రింది అడ్రసుకు వ్రాసి తెప్పించుకోవచ్చును.

గోపాల్‌జీ చాంప్‌షీ అండ్ కో.,

80, గోవిందప్ప నాయక్ వీధి, * జి. టి. మదరాసు.

# నవ్వించే చిత్రం

# "గుణసుందరి"

శాలా!

వాహిని పిక్చర్సువారు తీసిన ఫిల్ము గుణసుందరి మీవూరు వచ్చిందా? వస్తే వెంటనే వెళ్లి చూడు. బలేచిత్రం సుమా! చాలా బాగా తీశారు.

మొట్ట మొదట పార్వతీ పరమేశ్వరులు ఆకాశంమీద కనిపిస్తారు. భూలోకంలో ఒక అమ్మాయి "గుణసుందరి" ఏడుస్తూవుండగా పార్వతి ఆఏడ్పువిని కారణం అడుగుతుంది. అప్పుడు పరమేశ్వరుడు పార్వతికి ఈకథ చెప్తాడు.

"గుణసుందరి" అనే అమ్మాయి మొగుడు వెలుగుబంటిగా మారిపోతే ఏడుస్తూ వుంటుంది. గుణసుందరి అసలు ఒక రాజుకూతురు. ఆ రాజు మహా కోపి. కూతుళ్లు తమ భర్తలకన్నా, తననే ఎక్కువగా ప్రేమించాలంటాడు. పెద్దకూతుళ్లిద్దరూ తండ్రిని పొగిడేవారు కాని గుణసుందరి, తండ్రి కన్నా భర్తే ఎక్కువ అని అంటుంది. కోపంచేత. రాజు గుణసుందరిని ఒక కుంటి, గుడ్డి, చెముడు, మూగవున్న ఒక కురూపికి ఇచ్చి పెళ్లి చేస్తాడు

తీరా పెళ్లిఅయిం తరువాత, వాడు నిజంగా అటువంటివాడు కాడని తెలిసి రాజు వాడిని కొట్టబోతాడు. కాలు జారి, మెట్లమీంచిపడి దెబ్బతగులుతుంది. గుణసుందరి, తన బీద, మురికి భర్తతో ఒక పూరిగుడిసెలో కాపరం చేస్తూవుంటుంది.

రాజు కాలిదెబ్బ మానలేదు. ఎన్ని వైద్యాలు చేసినా కురుపు తగ్గలేదు. "మహేంద్రమణి"ని తెస్తేనే గాని ఆ గాయం మానదని తెలుస్తుంది. రాజు, ఆ మహేంద్రమణిని ఎవరు తెస్తే వారికి రాజ్యం ఇచ్చేస్తానంటాడు.

పెద్దల్లుళ్లిద్దరూ బయలుదేరుతారు. గుణసుందరికూడా తన భర్తను పంపుతుంది. ఆఖరికి గుణసుందరి భర్తే ఆ మణిని సంపాదిస్తాడు. కాని, మిగిలిన ఇద్దరూ, ఆ కురూపిని ఒక పాడుపడిన నూతిలో పడేసి, మణిని ఎత్తుకోపోతారు.

శాపవశాత్తు, గుణసుందరి మొగుడు ఒక వెలుగుబంటిగా మారిపోతాడు!

రాజుదగ్గరకు తెచ్చిన మహేంద్రమణి ఒక మంత్రం వేస్తేనేకాని ప్రకాశించదు. పెద్దఅల్లుళ్లు ఆమంత్రం మరిచిపోతారు.

ఆఖరికి ఈ వెలుగుబంటి మనిషిగా ఎలాగ మారిపోయాడో, రాజుగారి గాయం ఎలాగ నయం అయిందో-ఈ కథ చాలా తమాషాగా ఉంటుంది.

ఇందులో కురూపి అల్లుడుగా శివరావు వేశాడు. రేలంగి, సుబ్బారావులు పెద్ద మొద్దు అల్లుళ్లుగా వేశారు. ఈ ముగ్గురూ హాస్యం బాగా చేశారు.

జూనియర్ శ్రీరంజని గుణసుందరిగా బాగుంది. చిన్న గుణసుందరిగా వేసిన చి॥ కువ్వూరి కల్పకం ఎంతో ముద్దుగా వుంది. గుణసుందరి తండ్రిగా వేసిన డాక్టరు సుబ్బారావుగారికి పాత్ర సరిపోయింది, డైరెక్టర్ కె. వి. రెడ్డిగారు చిత్రం బాగా తీశారు. విసుగును పుట్టించే పాటలు లేకుండా బాగుంది.




### శ్రీరామక్లబ్ (తుని)

30 మంది సభ్యులతో ఈ మధ్యనే ఆరంభ మయింది. శ్రీ ఎ. వి. ఆర్. పాపారావుగారు అధ్యక్షులు. ఎస్. రామకృష్ణ కార్యదర్శి. ఇందు ఆడు కొనుటకు ఆటలు, చదువుకొనుటకు లైబ్రరీ వున్నది.

### ఆంధ్ర కేసరీ బాలసంఘం (నెగ్గిపూడి)

డిసెంబరు 5 తేదీని స్థాపించబడింది. శ్రీ తోలేటి లక్ష్మీనారాయణమూర్తి, దక్షిణామూర్తి, మదుల రామకృష్ణ శాస్త్రీగారలు నడుపుచున్నారు. బాల పత్రికలు తెప్పించి చదువుచున్నారు.

### గణపవరం బాలసారస్వత సంఘం

డిసెంబరు 1-వ తారీఖున ఈ సంఘం స్థాపించ బడింది. "ఆంధ్రబాల" అను వ్రాత పత్రిక నడుపుతున్నారు. ఈ సంఘం అధ్యక్షులు వి. హనుమంత రావుగారు.

### మచిలీపట్నం జైహింద్ లైబ్రరీ

ఈ లైబ్రరీ, పఠనాలయం నిజాం పేటలో పెట్టబడింది, 'ఆంధ్రమాత' అనే పిల్లల వ్రాత పత్రిక నడుపుచున్నారు. పిల్లలంతా వెళ్లి ప్రోత్సాహించండి.

### కడప శ్రీసమర్థబాల సంఘము

డిసెంబరు 1-వ తేదీని శ్రీ కె. వరసింహారావు ఆధ్వర్యమున సమావేశ మయింది. ఈ సంఘములో రాయలసీమ బాల బాలికలు ఉచితముగా చేర వచ్చును. ప్రతినెలా విజ్ఞానవిషయము లలో పోటీ జరుపుతారు. శ్రీ కృష్ణ స్వామి, ఇందిరల జాతీయ గీతముతో ఆనాటి సభ ముగిసింది.

బాల
(పిల్లల బొమ్మల పత్రిక)
చందా సాలుకు రూ 5/-
"బాల" ఆఫీసు
10, రాయపేట హైరోడ్,
మదరాసు-14.

కోటా నరసిమ్ములుశెట్టి & సన్సు
(కోటా మునిరత్నంశెట్టి కుమారుడు)

మంచి వెండి, బంగారు నగలుచేయు వారు. రంగూను కమలాలు, సీమ కమలాలు, నగలు అమ్మబడును.

ఆర్డరుమీద స్పెషలుగా తయారు చేయబడును.

217/3, చైనాబజారు,
మదరాసు 1.

# మాటలతో ఆటలు---నెం 3

బాలా !

ఈ దిగువ చదరంలోని అక్షరాలు నింపి, మాటలు పూర్తిచేసి ఉంచుకో. వచ్చే నెల ‘బాల’లో సరియైన సమాధానం చూడు.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 గం | ■ | ■ | 2 గం | గి | 3 రె | ద్దు |
| 4 గ | ది | ■ | పె | ■ | క్క | ■ |
| రా | ■ | 5 క | డు | 6 వే | ■ | ■ |
| 7 వి | | ల | ■ | 8 స | క్రాం | 9 తి |
| ■ | ■ | 10 ము | 11 ని | గి | ■ | ల |
| ■ | 12 గ | ■ | జ | ■ | 13 రూ | క |
| 14 ప్ర | ని | ల | ము | ■ | ■ | ము |

## ఆధారాలు

### అడ్డము

2. డూ డూ బసవన్న
4. దీనికి తలుపులుంటాయి
5. వేడుక (తలక్రిందులు)
7. భూమి
8. పెద్ద పండుగ
10. మునిగి (అవే)
13. పండుగనాడు కొందరు —లతో జూదమాడుతారు.
14. గాలి.

### నిలువు

1. ఒక చెట్టు
2. గంగిగోవుపాలు—చాలు.
3. పక్షికి వుంటుంది.
5. దీనితో వ్రాస్తాము
6. ఎండాకాలము
9. బొట్టు
11. సత్యము
12. దీనిని త్రవ్వి లోహము తీస్తారు.

# తెనుగు పిల్లల రేడియో ప్రోగ్రాములు

## బాలానందం

### జనవరి 1950

### 7-వ తేదీ శనివారం

రారండోయ్; అక్కయ్య కబుర్లు; 'మూడుసలహాలు'-నాటిక 'భోగిపిడకలు పెడదామా-పాట మీ ఆటలు, పాటలు; చాలునింక.

### 14-వ తేదీ శనివారం

రారండోయ్; అక్కయ్య కబుర్లు; "హుష్కిత్-మిఠ్రిహి"-నాటిక; పండుగ పాటలు; మీ పాటలు, కథలు; చాలునింక.

### 21-వ తేదీ శనివారం

రారండోయ్; అక్కయ్య కబుర్లు; "మూడు కుందేళ్లు"- నాటిక; అనగా అనగా కథ; 'కోయిలరో-పాట; మీకథలు, కబుర్లు; చాలునింక.

### 26-వ తేదీ గురువారం (రిపబ్లిక్ దినం)

జోహార్! నవభారతి జోహార్! బాలల సభ; "ఎగురవే జండా"-పాట "మనదేశం-ఇదే-మనదేశం"-కులాసా కబుర్లు.

### 28-వ తేదీ శనివారం

రారండోయ్: అక్కయ్య కబుర్లు; "కవలపిల్లలు"-నాటిక; స్తంభాలాట-ఆటపాట; అనగా అనగా కథ; మీ పాటలు, పద్యాలు; చాలునింక.

## ఆటవిడుపు

### జనవరి 1950

### 1-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార ఉత్తరాల సంచి; 'కొత్త తీర్మానాలు'-నాటిక; తాతయ్యతో తమాషాలు; మీరు కోరిన పాటలు; పోదామా.

### 8-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచి; దొంగరాజు-నాటిక; "పొట్టి బావ ఫోటో"-హాస్యం; సంక్రాంతి పాటలు; పోదామా.

### 15-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచి; "రంగవల్లి"-నాటిక; ధాన్యలక్ష్మి-పాట పొడుపుకథల పోటీ; పోదామా.

### 22-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచి; 'తెనుగుతల్లి'-నాటిక; 'భారత నేతకు జోహార్'- పాట; మీ మీ ముచ్చట్లు; పోదామా.

### 29-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచి; "జారగో జాకన్య'-నాటిక; "వీరబాలలార రండు"-పాట; మీ పాటలు పద్యాలు; పోదామా.

## మాటలతో ఆటలు నెం॥ 2

(జవాబు)

**అడ్డము:** 3. లోపము; 4. గరిక; 5. వనము; 7. ముదిమి; 9. నిరాశ (లేక) పేరాశ; 11. తోముట; 13. బరులు; 14. కమ్మరి (లేక) కుమ్మరి.

**నిలువు:** 1. కలువ; 2 భాగము (లేక) సగము; 3. లోకము; 6. నగారా; 8. దినము; 10. శబరి; 11. తోలుట; 12. టక్కరి.

---

ఆనందం కలిగించేవి ఆట (జవాబు)

3. 5 [illegible]

---

### పొడుపు కథలు జవాబు

1. వెలగపండు; 2. ఎలుక; 3. ఊయల; 4. తాళము; 5. దీపము; 6. చీమలబారు; 7. మొక్కజొన్న; 8. ముగ్గు; 9. చొక్కా; 10. కత్తిపీట. 11. చద్దిమూట; 12. పెడపొయ్యి.






---


"బాల" రిపబ్లిక్ సంచిక

జనవరి 26 తేదికి వస్తుంది.

ప్రతి "బాల" చదవవలసిన సంచిక

అనేక కార్టూనులు. గమ్మత్తులు

ప్రత్యేకవ్యాసాలూ, కథలూ వుంటాయి.

వెల ఆరు అణాలే!

ఏజంట్లు ఎన్ని కాపీలు కావాలో ముందుగానే తెలియజేయాలి.

"బాల" రాయపేట, మదరాసు-14.



Edited and Published by N. Raghava Rao & Printed by N. Kameswari at the "BALA PRESS", 170, Royapettah High Road, Madras 14-



చి॥ ఎస్. మోహన్



చి॥ ఎస్. గీత

చిరంజీవి!




హిమాంశుబాల (బెంగుళూరు)

విజయనగరంబాల



చి॥ ఎన్. ఎస్. ఆర్. లక్ష్మి


డిసెంబర్ 29 మొదలు
ఆంధ్రదేశమంతటా విడుదల....
వాహినీ వారి
గుణసుందరి
కథ..
అనుక్షణము ప్రేక్షకులను
కవ్వించి నవ్వించె
అపూర్వ జానపద చిత్రము.
డైరెక్టర్
కె.వి. రెడ్డి, B.Sc (HONS)
అసోసియేట్ డైరెక్టర్
కె. కామేశ్వరరావు, B.A
విజయవాడ... సరస్వతి
గుంటూరు.... సరస్వతి
తెనాలి....... రత్నా
ఏలూరు.... పాండురంగా
మచిలీపట్నం... మినర్వా
రాజమహేంద్రవరం... జయ
కాకినాడ క్రౌన్
విశాఖపట్నం... సరస్వతి
విజయనగరం... కృష్ణా
బళ్లారి..... రాయల్
కర్నూలు... చాంద్
బెంగుళూర్... మూవీల్యాండ్ (శ్రీ)
మైసూర్... చాముండేశ్వరి
షోలాపూర్... సరోజ్